

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 43 | గురువారం 12 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3


## మయూరంపై మల్లన్న వైభోగం






## అసెంబ్లీలో సబ్జెక్టుపై అవగాహనతో రావాలి

**ఆవు కథలు చెప్పి తప్పించుకోరాదు**
**ప్రతిరోజూ అటెండెన్స్ ఉండాల్సిందే**
**ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచన**

2లో


వ్యక్తిగత కక్షల ప్రస్తావనకు అసెంబ్లీని వేదికగా చేసుకోవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచించారు. సమస్యలను చర్చించి సిద్ధంగా ఉండాలన్నారు. సబ్జెక్ట్‌పై ప్రిపేర్ రావాలని అన్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా కూటమి నేతల ఐక్యత కొనసాగుతోందని చెప్పారు. కింది స్థాయిలోనూ ఇదే పరిస్థితి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో 3 పార్టీల నేతలు సమావేశాలు పెట్టుకుంటూ ఐక్యత పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరుపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మాట్లాడతా. 40 మందిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడతా.




**రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ గాడిన పడిందన్న గవర్నర్ అబ్దుల్ నజీర్**
**ఉభయ సభలను ఉద్దేశించి బడ్జెట్ సమావేశాల తొలిరోజు ప్రసంగం**
**రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.62 లక్షల కోట్లకు చేరిందని వెల్లడి**
**తలసరి ఆదాయం రూ.2.95 లక్షలకు పెరిగిందని స్పష్టీకరణ**
**గత ప్రభుత్వ పాలనపై 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని వెల్లడి**

2లో

## ఏపీ గవర్నర్ ప్రసంగం..



## ముంబయి మేయర్‌గా రితూ తావ్డే



2లో

### ఏకగ్రీవంగా ఎన్నికైన బిజెపి కార్పోరేటర్

ముంబయి మేయర్‌గా మహాయుతికి చెందిన రితూ తావ్డే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 25 ఏళ్లలో భాజపాకు ఈ పదవి దక్కడం ఇదే తొలిసారి. స్థానికంగా భాజపా సీనియర్ నేత అయిన రితూ .. ఘట్కోపర్ వెస్ట్ నుంచి మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు.

## పోలీసుల తీరుపై జగ్గారెడ్డి ఆగ్రహం



పట్టణంలోని 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న సీఐ.. 34 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గల్ల పట్టుకున్నారని ఆరోపిస్తూ సీనియర్ నేత జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామంటూ బూత్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. సీఐని సస్పెండ్ చేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ఎగ్జిట్ పోల్స్

2లో



**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ విజయం అంచనా**
**దాదాపు 70 నుంచి 85 మున్సిపాలిటీలు గెలుచుకోనున్న అధికార పార్టీ**
**బీఆర్ఎస్, బీజేపీలు చాలా వెనుకబడి ఉన్నాయని తేల్చిన సర్వేలు**
**నిజామాబాద్, కరీంనగర్‌లలో బీజేపీకి, మిగిలిన కార్పొరేషన్లలో కాంగ్రెస్‌కు ఆధిక్యం**
**ఫిబ్రవరి 13న వెలువడనున్న అధికారిక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ**

తెలంగాణలో బుధవారం ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల పోలింగ్ అనంతరం విడుదలైన సర్వేలన్నీ కాంగ్రెస్‌కే పట్టం కట్టాయి. ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఓటర్లను ఆకట్టుకోవడంలో విఫలమైనట్లు ఈ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. వివిధ సర్వే సంస్థల అంచనాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం కాంగ్రెస్ 68 నుంచి 76

## వైసీపీ పట్ల అప్రమత్తంగా ఉండండి



**చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం**
**వైసీపీ కుట్రల పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అప్రమత్తంగా ఉండాలని పవన్ సూచన**
**హిందూమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని వైసీపీ చూస్తోందని ఆరోపణ**

2లో

వైసీపీపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగిస్తుండగా




## మీకు సిగ్గనిపించడం లేదా

**భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు**
**ఆర్థిక మంత్రి నవ్వుతూ ఉంటారు.. మన డేటాతో ఏం చేశారని లోక్‌సభలో ప్రశ్న**
**ఈ ఒప్పందంతో దేశ టెక్స్‌టైల్ పరిశ్రమ, రైతులు నాశనమవుతారని ఆరోపణ**
**దేశ ప్రయోజనాలను అమెరికాకు అమ్మేశారంటూ సంచలన వ్యాఖ్యలు**
**ఇంధన స్వాతంత్ర్యాన్ని కూడా అమెరికాకు తాకట్టు పెట్టారని ధ్వజం**

2లో

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని, దీని ద్వారా దేశాన్ని, 'భారత మాత'ను అమెరికాకు అమ్మేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. విదేశీ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లకు పన్ను రాయితీలు ఇవ్వడంపై రాహుల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఆర్థిక మంత్రి నవ్వుతున్నారు, ఆమెకు నవ్వడం అంటే చాలా ఇష్టం. పెద్ద టెక్ కంపెనీలకు 20 ఏళ్ల పాటు పన్ను మినహాయింపు ఇచ్చారు. మన డేటాతో మీరు చేసిందేమిటి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

## గవర్నర్‌కు స్వాగతం పలికిన సిఎం, స్పీకర్





2లో

# అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రక్రియ పక్కాగా గాడిన పడిందని, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ జాగ్రత్తతో కూడిన ప్రాధాన్యతలు, సంస్కరణల ద్వారా రాష్ట్రం వృద్ధి పథంలోకి తిరిగి వస్తోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత 21 నెలల్లో ప్రభుత్వం మౌలిక సంస్కరణలను పూర్తి చేసిందని, అన్ని రంగాల్లోనూ స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు తమ ప్రభుత్వానికి అప్పగించారని గవర్నర్ గుర్తుచేశారు. "గత కొన్నేళ్ల ఆర్థిక ఒత్తిడి తీవ్ర అసమతుల్యతలను సృష్టించింది. అనేక రంగాల్లో గణనీయమైన అప్పులు పేరుకుపోయాయి. అయినా, ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి, రుణ వ్యయాలను తగ్గించడానికి, విశ్వసనీయతను తిరిగి సంపాదించడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. స్వర్ణాంధ్ర దార్శనికతతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన వివరించారు. ప్రభుత్వ ప్రయత్నాల ఫలితంగా రాష్ట్ర ఆర్థిక పనితీరు మెరుగుపడిందని గవర్నర్ తెలిపారు. "2025–26 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (+ఊణా) గత ఏడాది రూ.15.91 లక్షల కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 10.75 శాతం నామమాత్రపు వృద్ధి రేటును సూచిస్తోంది. రాష్ట్ర తలసరి ఆదాయం గతేడాది రూ.2.66 లక్షల నుంచి రూ.2.95 లక్షలకు పెరిగింది. వ్యవసాయ రంగంలో 7.83 శాతం, పరిశ్రమల రంగంలో 9.53 శాతం, సేవల రంగంలో 12.94 శాతం వృద్ధి సాధించాం" అని ఆయన గణాంకాలతో సహా వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దుష్పరిపాలనపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసినట్లు గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం, పోలవరం ప్రాజెక్టును పట్టాలు తప్పించడం, విద్యుత్ రంగం విధ్వంసం, సహజ వనరుల దుర్వినియోగం, అవినీతిమయమైన ఎక్సైజ్ విధానాలు, శాంతిభద్రతల క్షీణతతో పాటు భవిష్యత్ రాజధాని అమరావతిని నాశనం చేసే లక్ష్యంతో చేసిన మూడు రాజధానుల ప్రతిపాదన వంటి అంశాలను ఈ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'సూపర్ సిక్స్' హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించామని, క్రమంగా పాలనను పునరుజ్జీవనం నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లామని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే జాతీయ ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాన్ని 'సంపన్న, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన'దిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పరివర్తన యజ్ఞంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. మన బలంపై విశ్వాసంతో, ఐక్య లక్ష్యంతో ఏపీ ముందుకు సాగుతోందని, ప్రతి పౌరుడూ గౌరవంగా, అవకాశాలతో జీవించే భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# మృగ్యమైన మావలంకర్ వారసత్వం







'లోక్‌సభ తొలి స్పీకర్ జీవీ మావలంకర్, రెండవ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్, రాజ్యసభ తొలి చైర్మన్, ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్లమెంటరీ సంస్థల పనితీరుపై గొప్ప ప్రభావాన్ని చూపారు. నిబంధనలు, విధానాలు, సంప్రదాయాలు, పద్ధతులను రూపొందించడంలో వారు హుందాగా, నిష్పాక్షికంగా వ్యవహరించేవారు. రాజ్యసభలో జనసంఘ్ కు ప్రాతినిధ్యం ఉండకపోయినా నేను అతిథుల గ్యాలరీల నుంచి అక్కడి చర్చలను తిలకించేవాడిని. ప్రశ్నోత్తరాల సమయం, వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్థాయీ సంఘాలు, సావధాన నోటీసులు, సభ్యుల హక్కులు మొదలైన వాటన్నింటి గురించి నేర్చుకునే అవకాశం నాకు వారి వల్లే లభించింది. ప్రతిపక్ష బెంచీల్లో కూర్చున్న హేమాహేమీలు కూడా అధికార పక్షం వైపు కూర్చున్న సభ్యులతో సమానంగా అనర్గళంగా మాట్లాడేవారు. ప్రతిపక్షాల హక్కులకు సంరక్షకుడిగా స్పీకర్ నిజాయితీతో వ్యవహరించేవారు. ఈ ఉత్తమ సంప్రదాయాల వల్లే భారత దేశ ప్రజాస్వామ్యం పరీక్షలకు తట్టుకుని నిలబడింది. అంతర్జాతీయంగా తన ప్రతిష్ఠను నిలబెట్టుకుంది' ఈ మాటలు ఎవరివో కాదు, భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన లాల్‌కృష్ణ అద్వానీవి. తన ఆత్మకథ ' నా దేశం నా జీవితం' లో ఒకప్పటి పార్లమెంటరీ ప్రమాణాల గురించి అద్వానీ వివరంగా రాశారు. ఏ ప్రమాణాలైనా వ్యక్తులు నిలబెడితేనే సుస్థిరంగా ఉంటాయి. వ్యక్తులు తమ ప్రయోజనాలకోసం ప్రమాణాలను వటంగా పెడితే ఉదాహరణగా చెప్పుకోవడానికి ఏ ప్రమాణాలూ నిలువవు. సమాజంలో దిగజారుతున్న విలువలు పార్లమెంటరీ చర్చలను ప్రభావితం చేస్తే మన ప్రజాస్వామ్య పతనం ఎలా ఉంటుందో చెప్పేందుకు నేడు చట్టసభలు సాగుతున్న తీరే నిదర్శనం. 'మీరు మాకు మార్గనిర్దేశనం చేయండి, మేము దారి తప్పితే అవసరమైతే మాకు బుద్ధి చెప్పండి. మా ప్రవర్తనను సరిదిద్దండి' అని తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ లోక్‌సభ తొలి స్పీకర్ గణేశ్ వాసుదేవ్ మావలంకర్ ను అభ్యర్థించారు. ఎప్పుడైనా తీవ్ర విభేదాలు నెలకొన్నప్పుడు ప్రధానమంత్రి, స్పీకర్, కార్యదర్శి కలిసికట్టుగా సంప్రదించుకుని సమస్యను పరిష్కరించేవారు. ఒక రోజు సభలోనే మావలంకర్, నెహ్రూ మధ్య వాగ్వివాదం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఒకే రోజు రెండోసారి ప్రకటన చేయాలని నెహ్రూ సంకల్పించారు. అయితే అలా మాట్లాడడం నిబంధనల ప్రకారం కుదరదని మావలంకర్ స్పష్టం చేశారు. నెహ్రూ సరేనంటూ వెనక్కు తగ్గారు. ఆర్డినెన్స్ లను మావలంకర్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. అరుదైన పరిస్థితుల్లో మినహా ఆర్డినెన్సులు జారీ చేయవద్దని స్పష్టంగా చెప్పేవారు. ఈ విషయమై ప్రధానికి లేఖ రాసేవారు. న్యాయపరమైన సందేహం వస్తే స్వయంగా అటార్నీ జనరల్ ను సంప్రదించేవారు. స్పీకర్ న్యాయమూర్తిగా వ్యవహరించాలని మావలంకర్ చెప్పేవారు. నెహ్రూ కూడా మావలంకర్ కు సమున్నత గౌరవం ఇచ్చేవారు. పార్లమెంటరీ కమిటీల్లో తమ నిర్ణయాలను తప్పనిసరిగా చేస్తున్నారని అధికారులు నెహ్రూకు ఫిర్యాదు చేసినప్పుడు దాని గురించి మాట్లాడడం తన పరిధిలో లేదని, స్పీకర్ నే సంప్రదించమని సలహా ఇచ్చేవారు. అనేక విషయాలకు సంబంధించి మావలంకర్ రూపొందించిన నియమ నిబంధనలే ఇప్పటికీ ఉన్నాయి. ' పాలక, ప్రతిపక్షాల మధ్య సరైన సమతుల్యత ఉండేలా చేస్తూ, సభను సమర్థంగా నిర్వహిస్తూ, ప్రజల ప్రయోజనాలను కాపాడిన సభాపతి జీవీ మావలంకర్ 'అని లోక్ సభ తొలి సెక్రటరీ జనరల్ ఎమ్ఎన్ కౌల్ అన్నారు. పార్లమెంటు ప్రభుత్వ అధికారాలకు లోబడి ఉండకూడదని స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించాలని నిర్ధారించిన మావలంకర్ గుజరాత్ నుంచి ఎన్నికైన సభ్యుడు కావడం గమనార్హం. మావలంకర్ మరణం తర్వాత స్పీకర్ అయిన అనంతశయనం అయ్యంగార్ కూడా అదే దారిలో నడిచారు. తిరుపతి సమీపంలోని తిరుచానూర్ లో వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన అయ్యంగార్ లోక్ సభను నిష్పాక్షికంగా నడిపించేవారు. 'ఒక నియంత పాలనలో గానీ లేదా సంపూర్ణ రాచరిక పాలనలో గానీ పౌరుల జీవనానికి, స్వేచ్ఛకు ఎలాంటి రక్షణ ఉండదు. నియంత మంచివాడైతేనే ప్రజలు క్షేమంగా ఉంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో పాలకులు తమ వర్గాలకే అనుకూలంగా వ్యవహరిస్తూ చట్ట సభలో తక్కువ సంఖ్యలో ఉన్న వారిని అణిచివేసే ప్రమాదం ఉంది. ఆ ధోరణులను కఠినంగా నియంత్రిస్తూ తక్కువ సంఖ్యలో ఉన్న సభ్యుల ప్రయోజనాలను కాపాడగలిగిన వ్యక్తి సభాధ్యక్షుడు (స్పీకర్) మాత్రమే' అని అయ్యంగార్ ఒక సందర్భంలో స్పష్టం చేశారు. ఇంగ్లీషులో హిరేన్ ముఖర్జీ (సీపీఐ), హిందీలో అటల్ బిహారీ వాజపేయి( జనసంఘ్)ను మించిన వక్తలు లేరని ఆయన కొనియాడేవారు. సరైన సంఖ్యాబలం లేనందువల్ల ప్రతిపక్ష నాయకుడంటూ లేకపోయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులందరికీ అయ్యంగార్ ఎంతో గౌరవం ఇచ్చి వారు మాట్లాడేందుకు వీలు కల్పించేవారు. రెండవ లోక్ సభలో అధికార ప్రతిపక్ష సభ్యులందరూ ఏకగ్రీవంగా అయ్యంగారే మళ్లీ స్పీకర్ కావాలని ప్రతిపాదించారంటే ఆయన సంపాదించిన గౌరవం, నిలబెట్టిన ప్రమాణాలే కారణం. 1972లో తిరుపతి నుంచి ఒక దళిత క్రైస్తవ ఎమ్మెల్యేను నిలబెట్టినప్పుడు ఆయనను గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థన మేరకు అనంతశయనం అయ్యంగార్ రంగంలోకి దిగారు. 'విశిష్టాద్వైతంలోనే లౌకిక వాదం జీర్ణించుకుపోయింది' అంటూ ఆయన తనను ప్రశ్నించిన తన వర్గీయులకు జవాబు చెప్పి ఆ ఎమ్మెల్యేను గెలిపించారు. అయ్యంగార్ తర్వాత స్పీకర్ అయిన సర్దార్ హుకం సింగ్ తొలి సారి నెహ్రూ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాలను అనుమతించారు. ప్రభుత్వం కంటే పార్లమెంట్ ఆధిక్యతే ఎక్కువ అని ప్రకటించారు. ఆయన తర్వాత స్పీకర్ అయిన నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన రోజే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానంపై చర్చకు అనుమతించారు. నాల్గవ లోక్‌సభ అనంతరం పార్లమెంటరీ ప్రమాణాల పతనం ప్రారంభమయింది. ఎమర్జెన్సీలో పార్లమెంటరీ ప్రమాణాలు కనీవినీ ఎరుగని రీతిలో సెన్సార్ చేసినప్పటికీ ఉభయ సభల అధ్యక్షులు మౌనం పాటించారు. రెండు సార్లు లోక్ సభ స్పీకర్ గా ఉన్న జీఎస్ ధిల్లాన్ ను ఇందిరాగాంధీ రాజీనామా చేయించి అదే రోజు షిప్పింగ్ మంత్రిగా నియమించారు. చట్టసభలకు ప్రభుత్వాలు లోబడి ఉండే విధంగా ఆయన రూలింగ్ లు ఇవ్వడమే అందుకు కారణం కావచ్చు. ఒక ప్రాంతీయ పార్టీ నుంచి మొదటి సారి స్పీకర్ పదవిని అధిష్ఠించిన బాలయోగి స్పీకర్ పదవి తటస్థతను ఎంతగా కాపాడారంటే ఆయన హయాంలోనే వాజపేయి ప్రభుత్వం కేవలం ఒక్క ఓటుతో పడిపోవడమే అందుకు నిదర్శనం. ఆ తర్వాత స్పీకర్ పదవిని నిర్వహించిన మహిళా నేతలు మీరాకుమార్, సుమిత్రా మహాజన్ హయాంలలో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు తలెత్తేవి. తెలంగాణ ఆందోళన మూలంగా మీరాకుమార్ పని కత్తిమీద సాములా మారితే నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత అధికార పార్టీకి, ప్రతిపక్షాలకూ మధ్య తలెత్తిన ఘర్షణాత్మక వైఖరి సుమిత్రా మహాజన్ ను ఇబ్బందుల్లో పడవేసేది. అప్పటినుంచీ ఈ ఘర్షణ మరింత తీవ్రతరం కావడం, సుమిత్ర తర్వాత స్పీకర్ అయిన ఓం బిర్లా కూడా తరచు నిస్సహాయ పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తోంది. గత ఆరేళ్లలో మన పార్లమెంటరీ వ్యవస్థ ప్రమాణాలు బాగా దిగజారిపోతూ వస్తోన్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడనీయనందుకు ప్రతిపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. ఇది మన ప్రజాస్వామ్య దుస్థితికి అద్దం పడుతుంది. సైనిక దళాల మాజీ ప్రధానాధికారి మనోజ్ ముకుంద్ నరవణే తన ఆత్మ కథ 'ఫోర్‌ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'లో గల్వాన్ ఘర్షణల గురించి రాసిన విషయాలపై చర్చించడానికి అనుమతించి ఉంటే, అందుకు ప్రభుత్వం సమాధానమిచ్చి ఉంటే ఏమి జరిగేది? ప్రజలకు వాస్తవాలు బేరీజు వేసుకునేందుకు అవకాశం లభించేది. అలా కాకుండా అడ్డుకున్నందుకు ప్రతిపక్షాలు పార్లమెంట్‌ను స్తంభింపచేశాయి. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై పూర్తి స్థాయి చర్చ జరగకుండానే, లోక్‌సభలో ప్రధానమంత్రి మాట్లాడకుండానే పార్లమెంట్ సమావేశాలు నీరు కారిపోయే పరిస్థితి ఏర్పడింది. పైగా మోదీపై మహిళా ఎంపీలు దాడి చేయబోతున్నారని తనకు తెలిసిందని స్పీకర్ స్వయంగా చెప్పడం ఒక విచిత్ర పరిణామం. నిజానికి ఈ మొత్తం పరిస్థితికి ప్రభుత్వ, ప్రతిపక్షాలు పట్టువిడుపులతో వ్యవహరించకపోవడం, పార్లమెంట్‌ను తమ రాజకీయ క్రీడకు ఉపయోగించుకోవడమే కారణం. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఒకరికి మరొకరిపై పూర్తిగా గౌరవం లోపించిన ఈ పరిస్థితుల్లో స్పీకర్ నిష్పాక్షికంగా ఉంటారని, రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తారని ఎవరూ అనుకోరు. తద్వారా స్పీకర్ కూడా గౌరవం కోల్పోవడం స్పష్టంగా కనిపిస్తోంది. 'స్పీకర్ మొత్తం సభకు ప్రాతినిధ్యం వహిస్తారు. సభ గౌరవాన్ని, స్వేచ్ఛను ప్రతిఫలింపచేసే స్పీకర్. సభ అంటే దేశం కనుక స్పీకర్ దేశంలో స్వేచ్ఛకు చిహ్నంగా ఉంటారు. కనుక ఆ పదవి గౌరవప్రదమైనది. ఈ స్థానంలో అత్యుత్తమ సామర్థ్యం, నిష్పాక్షికత గల వ్యక్తులు బాధ్యతలు నిర్వర్తించాలి' అని నెహ్రూ అన్నారు. కానీ ఇప్పటి రోజులను, ఇప్పటి రోజులకు పోల్చడం సాధ్యం కాదు. నాడు అధికారంలో ఉన్న వారు స్వయంగా ప్రమాణాలను నిర్దేశించి భావితరాలకు ఆదర్శంగా ఉండాలని భావించేవారు. నేటితరం భారత కోసం దేశం తహతహలాడుతున్న ఈ సమయంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రమాణాలను కూడా ఫలానా తేదీ లోపు కాపాడాలనే విషయమై నేతలు తమలో తాము చర్చించుకోవడం అవసరం.

## సైబరాబాద్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

## ఎన్నికల తీరును పరిశీలించిన కమిషనర్ రమేశ్

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తు, తీరును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావెల్ కోల్ జెడ్పీహెచ్ స్కూల్, ఎల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీడిమెట్ల వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న లాల్ గడి మలక్ పేట్ జెడ్పీహెచ్ స్కూల్, అలియాబాద్ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల లోని ఇంద్రేశం ఎంపీయూపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు.

## ఎమ్మెల్యే భార్య స్టోర్‌లో చోరీ

## స్టోర్ ఉద్యోగి పనే అని గుర్తించిన పోలీసులు

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సతీమణి అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్న డిజైనర్ స్టోర్‌లో జరిగిన చోరీ కేసును బంజారాహిల్స్ పోలీసులు ఛేదించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎన్‌బీటీ నగర్‌లో ఓ డిజైనర్ స్టోర్‌ను అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఈనెల 6న ఆ స్టోర్‌లో ఓ చోరీ జరిగింది. ఈ స్టోర్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అమీనుల్ హక్(38) ఈ చోరీకి పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారు. అస్సాంకు చెందిన ఈ నిందితుడు కొన్ని నెలలుగా స్టోర్‌లో నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రివేళ పక్కా ప్రణాళికతో స్టోర్‌లోకి ప్రవేశించిన నిందితుడు.. సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా కిటికీ గుండా లోపలికి వెళ్లాడు. అక్కడ స్క్రూడ్రైవర్ సాయంతో లాకర్ తెరిచి రూ.2.43 లక్షల నగదును చోరీ చేశాడు. దోచుకెళ్లిన ఆ సొమ్మును తన ఇంట్లోని డస్ట్‌బిన్‌లో దాచాడు. మరుసటి రోజుఉదయాన్నే డ్యూటీకి వచ్చిన అమీనుల్ హక్.. స్టోర్‌లో దొంగలు పడ్డారంటూ హడావుడి చేశాడు. సీసీటీవీ కెమెరాల్లో స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు, క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. కిటికీ వద్ద లభించిన బూట్ల ముద్రలు కీలక ఆధారంగా నిలిచాయి. ఆ షూస్ ముద్రలు పూర్తిగా మ్యాచ్ కావడంతో అమీనుల్ హక్ గుట్టు రట్టయ్యింది. విచారణలో చోరీ చేసినట్లు అమీనుల్ హక్ అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన బంజారాహిల్స్ పోలీసులు.. అతడి నుంచి రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

# అసెంబ్లీలో సబ్జెక్టుపై అవగాహనతో రావాలి

ఆపు కథలు చెప్పడం మాని సబ్జెక్ట్ ప్రిపేర్ అయి సభకు రావాలి. ఎవరేం మాట్లాడుతున్నారో నేనూ నోట్ చేసుకుంటా అని అన్నారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి ఒక్కరూ ఉండాలి. నేను కూడా రోజూ ఉదయం 11 గంటల నుంచి సెషన్ అయ్యే వరకూ అసెంబ్లీలో ఉంటా. సభలో మాట్లాడేది 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీ అని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. అక్కడ ఏం మాట్లాడినా వారి కోసమేనని గ్రహించాలి. అనుకున్న విషయాన్ని 3 నుంచి 7 నిమిషాల్లో మాట్లాడాలి. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు జరుగుతున్న లబ్ధిని ఎప్పటికప్పుడు చెప్పాలి. రూ.లక్ష కోట్లకు పైగా హైవే పనులు, రూ.90వేల కోట్లకు పైగా రైల్వే పనులు జరుగుతున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో విశాఖ స్టీల్‌పై–లాంట్ రూ.450 కోట్ల నష్టంలో ఉంది. నష్టాలను అధిగమించి రూ.54 కోట్ల లాభాల్లోకి రావడం శుభపరిణామం. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. అన్ని మతాలను గౌరవించాలి.. భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయకూడదు. జగన్‌కు మతాలపై గౌరవం లేనందునే వైకాపా హయాంలో రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయి. తిరుమల శ్రీవారి లడ్డూతో పాటు ఎక్కడ వీలైతే అక్కడ కల్తీకి పాల్పడ్డారు' అని చంద్రబాబు అన్నారు.

## ముంబయి మేయర్‌గా రితూ తావ్డే

ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. వార్డు స్థాయిలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. కాగా, 227 సీట్ల బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 89 సీట్లు భాజపా గెలుచుకోగా శిండే సేన 29 స్థానాల్లో విజయం సాధించింది.

## వైసీపీ పట్ల అప్రమత్తంగా ఉండండి

11 నిమిషాల పాటు నిరసన తెలిపి వాకౌట్ చేశారు. అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కమిటీ హాలులో చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వైసీపీ కుట్రల పట్ల కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైసీపీ హింసాత్మకాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ హిందూమతాన్ని గౌరవిస్తారని అన్నారు. మన ప్రభుత్వంపై జగన్, ఆయన పార్టీ చేసే కుట్రలను గుర్తించాలని అన్నారు. అనంతరం, పర్యావరణ కేబినెట్ మాట్లాడుతూ, సభలో ఎంతసేపు మాట్లాడామనే దానికంటే అవసరమైన విషయం ఎంత మాట్లాడామనేది ముఖ్యమని అన్నారు. దావోస్‌లో ముఖ్యమంత్రి, తాను ప్రతి సంస్థను ముందస్తుగా కసరత్తు చేసినట్లు చెప్పారు. అందుకే తమను కలిసిన ప్రతి సంస్థకు ముఖ్యమంత్రి క్లుప్తంగా ఏడు నిమిషాల్లోనే విషయం చెప్పి మెప్పించేవారని గుర్తు చేసుకున్నారు. అందుకే తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి కలవగలిగారని అన్నారు. శాసనసభలో కూడా సభ్యులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు...

మున్సిపాలిటీలను క్లైవసం చేసుకుంటుందని వెల్లడించగా, బీకాన్ సర్వే ఏకంగా 80–85 పీఠాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ 8 నుంచి 36 స్థానాలకు, బీజేపీ 3 నుంచి 6 స్థానాలకు పరిమితం కావచ్చని ఈ సర్వేలు అంచనా వేశాయి. వార్డుల వారీగా చూస్తే, ఆరవేకు వాణిజ్య సర్వే మరింత లోతైన విశ్లేషణ అందించింది. మొత్తం మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్‌కు 1400–1449 వార్డులు (48% ఓట్లు), బీఆర్ఎస్‌కు 745–793 వార్డులు (26% ఓట్లు), బీజేపీకి 358–399 వార్డులు (13% ఓట్లు) దక్కే అవకాశం ఉందని తెలిపింది. ఆశ్చర్యకరంగా జనసేన పార్టీ 30–35 వార్డులు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొనడం గమనార్హం. ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించవచ్చని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో కాంగ్రెస్ ఏకపక్ష విజయం సాధిస్తుందని తెలిపింది. కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐకి మధ్య గట్టిపోటీ ఉండగా, బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితం కావచ్చని సర్వేలు చెబుతున్నాయి. సామాజిక వర్గాల వారీగా చూస్తే, ఎస్సీ, ముస్లిం మైనారిటీ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమైతే తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత బలోపేతం చేసుకున్నట్లే. అయితే ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, అసలు ఫలితాలు ఫిబ్రవరి 13న జరిగే ఓట్ల లెక్కింపు తర్వాతే వెల్లడవుతాయి. ఈ ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# దేశాన్ని అమ్మేశారు

ఈ వాణిజ్య ఒప్పందం కింద టారిఫ్‌లలో చేసిన మార్పులు ఏకపక్షంగా అమెరికాకు మేలు చేసేలా ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. "మొదట్లో మనపై సగటు టారిఫ్ 3 శాతం ఉండేది, ఇప్పుడు అది 18 శాతానికి పెరిగింది. అంటే అది ఆరు రెట్లు ఎక్కువ. అమెరికా నుంచి దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి 146 బిలియన్ డాలర్లకు పెరుగుతాయి. కానీ మనకు వాళ్లు ఎలాంటి హామీ ఇవ్వలేదు. మనం మాత్రం వారికి కట్టుబడి ఉన్నాం. వాళ్లపై మన టారిఫ్ 16 శాతం నుంచి సున్నాకి తగ్గింది, మనపై మాత్రం వాళ్ల టారిఫ్ 3 నుంచి 18 శాతానికి పెరిగింది" అని ఆయన గణాంకాలతో వివరించారు. ఈ ఒప్పందం వల్ల దేశంలోని టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమవుతుందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. "అమెరికా బంగ్లాదేశ్‌పై సుంకాన్ని సున్నా శాతానికి తగ్గించింది, కానీ భారత్‌పై 18 శాతం విధిస్తోంది. మన టెక్స్‌టైల్ పరిశ్రమదారులు ఏం చేయాలి? వాళ్ల పోటీదారు బంగ్లాదేశ్. వాళ్లు అమెరికా కాటన్‌ను దిగుమతి చేసుకుంటే సున్నా డ్యూటీ. దీంతో మన టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమైపోతుంది" అని అన్నారు. అంతేకాకుండా, ఈ ఒప్పందం దేశ ఇంధన స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని రాహుల్ ఆరోపించారు. "ఇకపై మనం ఏ దేశం నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తుంది, మన ప్రధానమంత్రి కాదు. మనం ఎవరి నుంచి కొంటామో పర్యవేక్షిస్తారు. అమెరికాకు నచ్చని దేశం నుంచి భారత్ చమురు కొంటే, మనపై టారిఫ్‌లతో శిక్ష విధిస్తారు" అని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాలరాస్తోందని, "పేద రైతులను అణచివేయడానికి తలుపులు తెరిచారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శల తీవ్రతను పెంచుతూ, "మీరు భారతదేశాన్ని అమ్మేశారని నేను చెబుతున్నాను. దేశాన్ని అమ్మడానికి మీకు సిగ్గుగా లేదా? మన తల్లి భారత్ మాతను అమ్మేశారు" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి ఒత్తిడితోనే ఈ ఒప్పందానికి అంగీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు లోక్‌సభలో తీవ్ర దుమారం రేపాయి.

## గవర్నర్‌కు స్వాగతం పలకిన సిఎం, స్పీకర్



ఏపి అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. అసెంబ్లీ వద్దకు చేరుకున్న గవర్నర్ నజీర్‌కు సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వాగతం పలికారు. అసెంబ్లీ సమావేశాలకు మాజీ సీఎం జగన్ సహా వైకాపా సభ్యులు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కాసేపటికే సభ నుంచి జగన్‌తో పాటు ఎమ్మెల్యేలు బయటకు వెళ్లిపోయారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కుల పంపిణీ



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 11:** ముఖ్యమంత్రి సహాయ నిధి కింద బాధితులకు మంజూరైన చెక్కులను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. వెలుగోడు మండలం ఎమ్మెల్యే స్వగ్రామమైన వేల్పనూరు గ్రామంలో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ పరిధిలోని 41 మంది బాధితులకు 23 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు బండి ఆత్మకూరు మండలంలో ఏ కోడూరు కడుమల కాలువ జి లింగాపురం సంత జూటూరు సింగవరం గ్రామాలకు చెందిన బాధితులకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. పార్టీలకతీతంగా ఆపదలో ఉన్నవారికి వైద్య సహాయ ఖర్చు నిమిత్తం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే సహాయ నిధి కింద నిధులను మంజూరు చేస్తూ ఉన్నారు. ఏ కోడూరు గ్రామానికి చెందిన మువ్వల భాగ్యమ్మకు 41,400 రూపాయల చెక్కును పంపిణీ చేశారని స్థానిక నాయకుడు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. వెంగల్ రెడ్డి పేట గ్రామానికి చెందిన సయ్యద్ అనే వ్యక్తి వెన్నెముక చికిత్స చేయించుకున్న కారణంగా అతనికి 81,500 రూపాయల చెక్కును ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పంపిణీ చేశారని ఆ గ్రామ టిడిపి నాయకుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు

# ఆటో కార్మికుడు మృతి

**-ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య, జిల్లా సమితి సభ్యులు పి మురళీధర్ నివాళులు**



**శిరివెళ్ల :-(నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో ఆటో డ్రైవర్ షేక్ అంజన పామిడి షావలి మంగళవారం గుండె పోటుతో మృతిచెందగా నంద్యాల జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య మరియు జిల్లా సమితి సభ్యులు మురళీధర్ లు బుధవారం నివాళు లర్పించారు. సహచర ఆటో డ్రైవర్ల ద్వార సమాచారం తెలుసుకున్న ఏఐటియుసి నేతలు శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలోని మృతుడి స్వగృహనికి చేరుకొని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడు శావలి ఏఐటీయూసీ లో ఉంటూ అత్యవసర సమయంలో గర్భిణీ బాలింత మహిళలకు మానవతా దృక్పథంతో ఉచితంగా ఆటో రవాణా సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని జిల్లా కార్యదర్శి సుంకయ్య తెలియజేశారు. సుమారుగా 18 సంవత్సరాలుగా అత్యవసర సమయంలో మహిళలకు ఉచిత ఆటో సర్వీస్ అందించి నేడు తుది శ్వాస వదలడం జరిగిందన్నారు. మృతుడికి భార్య కూతురు కుమారుడు ఉన్నారని కుటుంబాన్ని పోషించాల్సిన చిన్న వయసులోనే మృతి చెందిన కారణంగా ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు.

# నులి పురుగుల నివారణ



**సిరివెళ్ల(నంది పత్రిక)** సిరివెళ్ల 11వ తేదీ బుధవారం నాడు స్థానిక ఆసుపత్రి నందు డాక్టర్ ఆంజనేయులు నాయక్ నులిపురుగుల నివారణపై శిక్షణా కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఈనెల 17 వ తేదీ న అన్ని అంగన్వాడి కేంద్రాలు ప్రాథమిక మాధ్యమిక ఉన్నత పాఠశాలలు మరియు కళాశాలలో 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆరోగ్య కేంద్ర పరిధిలో 6300 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తున్నట్లు తెలిపారు. చిన్నపిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువ ఉండడం మరియు వ్యాధి పైన అవగాహన రాహిత్యం వల్ల ఎక్కువగా నులి పురుగుల సంక్రమణ జరుగుతుందని . పిల్లలందరూ నులిపురుగుల సంక్రమణ పై అవగాహన కలిగి ఉండి నివారణ చర్యలు తీసుకుంటూ ఏడాదికి 2సార్లు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల నులిపురుగుల నివారణ సాధ్యమని తెలిపారు.. అపరిశుభ్ర పరిసరాల్లో చెప్పులు ధరించకుండా తిరగటం మరియు చేతుల శుభ్రత పాటించకపోవడం వలన కలుషితమైన నీరు ఆహారము వలన వ్యాధి సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. పిల్లలు కిశోర బాలికలు కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం రక్తహీనత శారీరక మానసిక ఎదుగుదల లోపాలు కలిగి ఉంటారని తెలిపారు. - సిహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ శరీరానికి బయట నుండి అందించిన పోషకాలన్నీ పిల్లల కడుపులో ఉన్న నులి పురుగులే తిని వేస్తాయని వీటి నివారణకు సరైన మందులు అందుబాటులో ఉన్నాయని డీ వార్మింగ్ డే రోజున ఆల్బెండజోల్ మాత్రలు అందరికీ ఇప్పించి 100% లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ సరస్వతి ఆరోగ్య సిబ్బంది ఐ సి డి ఎస్ సిబ్బంది ఆశా కార్యకర్తలు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బుడ్డాను కలిసిన శివ భక్తులు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 11:** బండి ఆత్మకూరు చెందిన పలువురు శివ భక్తులు బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని కలిశారు. గ్రామంలోని ఓ శివాలయం పునరుద్ధరణ విషయంపై ఎమ్మెల్యే స్వగ్రామమైన వేల్పనూరు గ్రామంలో ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. బండి ఆత్మకూరు లోని చౌడేశ్వరి ఆలయం వద్ద ఉన్న శివాలయం సంవత్సరాల కాలం నుండి పునరుద్ధరణకు నోచుకోక శిథిలావస్థలో ఉంది. ఈ విషయంపై "నా గురించి పట్టించుకోరా " అంటూ నంది పత్రికలో బుధవారం వార్త ప్రచురితమైంది. అంతకు ముందు రోజే శివాలయం దుస్థితిపై మాట్లాడుదాం రమ్మంటూ పలువురు శివ భక్తులను ఎమ్మెల్యే ఆహ్వానించడం జరిగింది. ఈ మేరకు శివ భక్తులందరినీ తన స్వగృహంలో రప్పించుకొని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. ఆలయం దుస్థితి స్థితిగతులను గురించి శివ భక్తులతో చర్చించారు. శివాలయానికి సంబంధించి ఏమైనా మాన్యమ్ భూములు ఉన్నాయా? లేదా అంటూ వారితో మాట్లాడడం జరిగింది. ఈ విషయాన్ని దేవాదాయ శాఖ అధికారుల తో చర్చించి త్వరలో ఆలయ పునరుద్ధరణ విషయంపై ఒక నిర్ణయం తీసుకుంటానని ఎమ్మెల్యే శివ భక్తులకు హామీ ఇచ్చారు.

# భక్తులతో గౌరవంగా మాట్లాడుతూ వారిని గైడ్ చేయండి..

**మీకు నియమించిన డ్యూటీ ప్రదేశంలో అప్రమత్తంగా ఉండాలి....**

**సాయుధ బలగాల సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.....**



**నంద్యాల/శ్రీశైలం ఫిబ్రవరి11(నంది పత్రిక):-** శ్రీశైలం నందు జరుగుచున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బందోబస్తు విధులకు స్పెషల్ పార్టీ, ఆర్ముడు రిజర్వు సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు సిబ్బంది కర్నూలు, నంద్యాల అన్నమయ్య మొదలగు జిల్లాల నుండి సుమారు 180 మంది సాయుధ బలగాల సిబ్బందికి బుధవారం జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శ్రీశైలంలో శివదీక్ష ధరించిన భక్తులకు సుధూర ప్రాంతాల నుండి ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రయాణించి దైవదర్శనానికి రావడం జరుగుతుందని కావున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా గౌరవప్రధంగా మాట్లాడుతూ వారు వెళ్ళవలసిన మార్గాల వైపు క్రమశిక్షణతో వెళ్లి దర్శనం చేసుకునే విధంగా దిశా నిర్దేశం చేయాలన్నారు. విధులలో ఉన్న సిబ్బంది ఎట్టి పరిస్థితులలోనూ సహనం కోల్పోరాదని, మీకు కేటాయించిన ప్రదేశాలలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. బందోబస్తుకు వచ్చిన సిబ్బందిని రెండు సెక్షన్లుగా విభజించి చంద్రావతి కళ్యాణమండపం, ఫ్రీ క్యూ లైన్ ,లడ్డు కౌంటర్, గంగాధర మండపం, నంది సర్కిల్, దాసరి సత్రం ,ఆర్టీసీ బస్టాండ్ ,సిద్ధరామయ్య కాంప్లెక్స్ ,పాతాళగంగ, స్నాన ఘట్టాలు మరియు పార్కింగ్ ప్రదేశాలలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్, శ్రీశైలం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ జీవన్ గంగానాథ్ బాబు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మంజునాథ్ మరియు బాబు మరికొందరు అధికారులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో ప్రశాంతంగా, సౌలభ్యంగా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

**బ్రహ్మోత్సవాల ప్రారంభం నుండి ఇప్పటివరకు 1,95,555 మంది దర్శనం చేసుకోగా వారిలో శివ స్వాములు 50,504 మంది ఉన్నారు.**

**భక్తులు అసత్య ప్రచారాలు అపోహలు నమ్మవద్దు....**

**సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలి....**

**పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకొని ప్రచారం చేయాలని విజ్ఞప్తి...**



**నంద్యాల/శ్రీశైలం ఫిబ్రవరి11(నంది పత్రిక):-** నంద్యాల జిల్లాలోని శ్రీశైలం నందు జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో శ్రీ శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తుల రద్దీ రోజు రోజుకి పెరుగుతూ ఉంది. కావున భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం వారు భక్తుల అవసరాల దృశ్య సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. అందుకు తగ్గట్టుగా పోలీసు శాఖ నుండి బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని, కావున భక్తులు తొందరపడకుండా సంయమనం పాటిస్తూ పోలీసువారి సూచనలను అనుసరిస్తూ దైవదర్శనం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరన్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని ఇప్పటివరకు 1,95,555 మంది భక్తులు దర్శించుకోగా వారిలో 50,504 మంది శివ స్వాములు దర్శనం చేసుకోవడం జరిగిందన్నారు. 08 వ తేదీన ఆదివారం రోజున 45,360 మంది దర్శనం చేసుకోగా వారిలో శివ స్వాములు 7,000 మంది ఉన్నారన్నారు. 09 వ తేదీ సోమవారం రోజున 49,015 మంది దర్శనం చేసుకోగా వారిలో 15,600 మంది శివ స్వాములు ఉన్నారన్నారు. 10 వ తేదీ మంగళవారం రోజున 70,930 మంది దర్శనం చేసుకోగా అందులో 22,424 మంది శివ స్వాములు ఉన్నారని, 11 వ తేదీ బుధవారం మధ్యాహ్నం 01 గంటల వరకు సుమారు 30,250 మంది దర్శనం చేసుకోగా వారిలో 5,480 మంది శివ స్వాములు ఉన్నారన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా సౌకర్యాల విషయంలో గానీ, శాంతి భద్రతల విషయంలో గాని,ట్రాఫిక్ గురించి కానీ మరి ఏ ఇతర విషయంలోనైనా సోషల్ మీడియాలో, దినపత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయాలనుకునేవారు తప్పనిసరిగా పూర్తి వివరాలు తెలుసుకొని, పరిస్థితిని గమనించి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుని మాత్రమే ప్రచారం చేయాలని, అసత్య ప్రచారాలు చేయరాదని అలా చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# శ్రీశైలం చేరుతున్న భక్తులకు కల్పించిన సౌకర్యాలపై సమగ్ర పర్యవేక్షణ







**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్**

**శ్రీశైలం ఫిబ్రవరి 11(నంది పత్రిక)** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చొని క్యూలైన్లు, ట్రాఫిక్ నిర్వహణ, దర్శనాల ఏర్పాట్లు, అన్నదాన భోజనాల వసతులు, పార్కింగ్ ప్రదేశాలు, నడకదారి భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక విశ్రాంతి కేంద్రాలు, తాగునీరు, వైద్య శిబిరాలు తదితర సదుపాయాలను సిసి కెమెరాల ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ముఖ్యంగా తొక్కిసలాటకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో దర్శనాలు జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నడకదారిలో వచ్చే భక్తులకు ప్రత్యేక వైద్య బృందాలు, మొబైల్ అంబులెన్సులు, తాగునీటి సదుపాయాలు, శుచితా ఏర్పాట్లు, భద్రతా చర్యలు పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని వాహనాలను నియంత్రిత పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తున్నామని, భక్తులు పోలీసు సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. క్యూలైన్లలో తొందరపడకుండా, చిన్నపిల్లలు మరియు వృద్ధులను ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఎక్కువసేపు ఎండలో నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తగినంత తాగునీరు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన పక్షంలో వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థలను వినియోగించుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ స్పందన కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి, భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనాన్ని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు.



# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ హవా...

## అగ్రస్థానాల్లో అభిషేక్, వరుణ్ చక్రవర్తి

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటర్ల జాబితాలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, బౌలర్ల జాబితాలో వరుణ్ చక్రవర్తి నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు, జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ 909 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇంగ్లండ్‌కు చెందిన ఫిల్ సాల్ట్ (821), పాకిస్థాన్ ఆటగాడు సాహిబ్జాదా ఫర్హాన్ (769) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. భారత వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఏడు స్థానాలు ఎగబాకి 25వ ర్యాంకుకు చేరుకున్నాడు. బౌలర్ల విభాగంలో వరుణ్ చక్రవర్తికి, రెండో స్థానంలో ఉన్న పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌కు మధ్య స్వల్ప తేడా మాత్రమే ఉంది. శ్రీలంక ఆల్‌రౌండర్ వనిందు హసరంగ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఐదో ర్యాంకుకు చేరాడు. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు ఎగబాకి 11వ ర్యాంకులో నిలిచాడు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత దామోదరం సంజీవయ్య జయంతిని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలి.




కర్నూలు నంది పత్రిక...... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఏఐసిసి అధ్యక్షులు, కర్నూలు జిల్లా వాసి అయిన దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా 14-02-2026 అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సంజీవయ్య గారు దేశానికి, రాష్ట్రానికి వివిధ హోదాల్లో చేసిన సేవలను, ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలను భావితరాలకు తెలియజేసేలా వ్యాసరచన, వకృత్వపు పోటీలు నిర్వహించాలని గౌరవ అధ్యక్షులు రామ శేషయ్య జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందించారు.

## శ్రీశైలంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి




శ్రీశైలం/నంద్యాల, ఫిబ్రవరి 11(నంది పత్రిక):- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం శ్రీశైలంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్సుల ఫ్రీక్వెన్సీ, రాకపోకల సమయాలు, వివిధ ప్రాంతాలకు బయలుదేరే బస్సుల షెడ్యూల్ తదితర అంశాలపై ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో బస్సులు సమయపాలన పాటిస్తున్నాయా లేదా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగుతున్నాయా అన్న విషయాలను ప్రయాణికులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. భక్తులకు స్పష్టమైన సమాచారం అందించేందుకు బస్టాండ్‌లో సమర్థవంతమైన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, ఏ బస్సు ఏ ప్లాట్‌ఫారమ్ వద్దకు వస్తుందో, ఏ సమయానికి బయలుదేరుతుందో నిరంతరం ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రద్దీ సమయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. అలాగే ప్రయాణికులకు కూర్చునే సదుపాయాలు తగినంతగా ఉన్నాయా లేదా, పారిశుధ్య పరిస్థితి ఎలా ఉందో, టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా జరుగుతోందా లేదా అన్న విషయాలను పరిశీలించారు. బస్టాండ్‌లో ఫ్యాన్లు సక్రమంగా పనిచేయాలనీ, త్రాగునీటి సదుపాయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా, అవసరమైతే అదనపు బస్సులు నడపాలని, రాత్రి వేళల్లో కూడా సేవలను బలోపేతం చేయాలని ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ సూచించారు.

## శివరాత్రి విశిష్టత - త్రైత సిద్ధాంత భగవద్గీతలపై ప్రచారం.



బేతంచెర్ల ఫిబ్రవరి 11 ( నంది పత్రిక) ఫిబ్రవరి15 న జరిగే శివరాత్రి పండుగను పురస్కరించుకుని "త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక డోన్ కమిటీ& హుసేనాపురం కమిటీ" ల సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం నాడు నంద్యాల జిల్లా, బేతంచెర్ల మండలం లోని హుసెనా పురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత మరియు అనుబంధ గ్రంథాల ప్రచారం, శివరాత్రి పండుగ పై ప్రచారం చేయడం జరిగింది.శివరాత్రి పండుగ విశిష్టతఏమనగాశివలింగం పైన ఉన్న "మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మ లకు గుర్తు" అని, ఆత్మ ను ఆరాధిస్తే, జీవుడు మోక్షం పొందుతాడు అని, అందుకే "మధ్య లో ఉండే విభూతి రేఖకు ఎర్రని బొట్టు పెడుతారు".మూడు ఆత్మల వివరణ తెలుసుకోవడం ఆధ్యాత్మికం లో ముఖ్యమైన విషయం.శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి, శ్రద్ధగా జ్ఞానం పొంది, ఇతరులకు కూడా దైవ జ్ఞానంను తెలియజేయడం అని అర్థం. త్రిగుణములు లేని స్థితిని "రాత్రి" అంటారు."శి"లి అనే బీజాక్షరం అగ్నికి గుర్తు, అలాగే "వ"అనే బీజాక్షరం నీరుకి గుర్తు. అగ్ని ఏవిధంగా నీటిని దహించి ఆవిరి చేస్తుందో, అలాగే జ్ఞానాగ్ని అనేది కర్మ ను కాల్చి వేస్తుంది.తద్వారా జీవుడు జన్మ లు నుండి బయట పడి మోక్షం పొందుతాడు.త్రిగుణములు లేని దైవం ను చేరుతాడు "అందుకే శివరాత్రిని మోక్ష రాత్రి", అని అంటారు. కావున అందరూ మోక్షం పొందాలి అనేది శివరాత్రి పండుగ యొక్క ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. (జీవితం లో ఒక సంవత్సర కాలం గడిచి పోయినది అని గుర్తు చేయడానికి ఈ పండుగలు వస్తున్నాయి అని అర్థం చేసుకోవాలి.విలువైన సమయాన్ని , ఆయుష్షు ను, దైవ ధ్యాస లో ఉంచాలి అనేదే ఈ పండుగ ల అంతరార్థం. )ఈ కార్యక్రమంలో లిత్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- డోన్ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు నాగార్జున నాగేంద్ర,వెంకటేశ్వర్లు,మద్దిలేటి, వెంకటేష్,మహేష్, సర్వేశ్వరయ్య,సుబ్బయ్య,సుంకన్న,శ్రీరాములు,జయశ్రీలు,త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక డోన్ కమిటీ ,హుసేనాపురం కమిటీ ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## బిజెపి పార్టీ ఓబీసీ మోర్చా నంద్యాల జిల్లా ఇంచార్జిగా శ్రీరాములు యాదవ్



నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 11 . (నంది పత్రిక ):భారతీయ జనతా పార్టీ ఓబీసీమోర్చా నంద్యాల జిల్లా ఇంచార్జి గా టి. శ్రీరాములు యాదవ్ రాష్ట్ర పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర పార్టీ నాయకత్వం నియామకం ఉత్తర్వులను శ్రీరాములు యాదవ్ అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను, మానవతా విలువలను, మానవతాభివృద్ధి కోసమే భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందని, అందులో భాగంగా ఓబీసీల అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ పెద్దపీట వేస్తున్న తరుణంలో తనకు ఈ బాధ్యతలు అప్పజెప్పడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. పదవులు ఇవ్వడం అంటే అది ఒక అలంకరణ ప్రాయంకాదు, బాధ్యత అని ఆయన తెలియజేశారు. సామాన్యులు రాజకీయంగా ఎదగడం ఒక్క బీజేపీ పార్టీలోనే సాధ్యపడుతుందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత దేశంలో ఉన్నటువంటి చివరి పేదవాడి వరకు సంక్షేమ పథకాలు ఫలితాల అందే దిశగా ఉద్యమిస్తుందని ఆయన తెలిపారు. నాకు ఈ బాధ్యతలు ఇచ్చినటువంటి పార్టీ పెద్దలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలలో పతకాలు సాధించిన నంద్యాల జిల్లా క్రీడాకారులు

### సబ్ జూనియర్, కబ్ విభాగాలలో 7 స్వర్ణ,3 రజత, 5 కాంస్య పతకాలు విజేతలను అభినందించిన డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన్ రావు బాక్సింగ్ కోచ్ లు ఫయాజ్, చంద్ర ,ప్రసాద్ ల శిక్షణలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు




నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 11 ( నంది పత్రిక ) సికింద్రాబాద్ బొల్లారం ఫుట్ బాల్ గ్రౌండ్ లో తెలంగాణ బాక్సింగ్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో నంద్యాల జిల్లా క్రీడాకారులు పాల్గొని 15 పతకాలు సాధించారు. వీరు అవుకు మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు చెందిన విద్యార్థులు. కబ్, సబ్ జూనియర్ విభాగాలలో వివిధ వెయిట్ కేటగిరీలలో జయశ్రీ ,యశ్వంత్ నాయక్, చంద్రకాంత్ ఆచారి, నంద సాత్విక్ రెడ్డి, దీపిక, లక్ష్మీ షర్మిల ,జ్ఞాన ప్రసన్న స్వర్ణ పతకాలు సాధించగా, తపస్వి భాయ్ ,సుశాంత్ ,పూజిత రజత పతకాలు, వైష్ణవి, మణి చరణ్, ధీరజ్ ,లక్ష్మణ్, హరిప్రియ లు కాంస్య పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి, రాష్ట్ర సంఘం కార్యవర్గ సభ్యుడు ఫయాజ్ ఆధ్వర్యంలో మధుమణి సమావేశ భవనంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జి. రవికృష్ణ, కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అతిథులుగా పాల్గొని విజేతలను,కోచ్ లు ఫయాజ్, చంద్ర, ప్రసాద్,మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్ లను శాలువ లతో సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలో బాక్సింగ్ క్రీడ అభివృద్ధి కోసం సహకరిస్తామని, క్రీడలలో రాష్ట్ర ,జాతీయ స్థాయిలో రాణించిన నంద్యాల జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించి సహకారం అందజేస్తామన్నారు. డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో పాల్గొనడం చాలా అవసరమని,తద్వారా మానసిక వికాసం,శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, విద్యార్థులను క్రీడలలో, కళలలో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్, కోచ్ లు చంద్ర, ప్రసాద్, మదర్ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# శ్రీశైలానికి వచ్చే భక్తులకు మెరుగైన ఏర్పాట్లు

### దర్శనానికి వచ్చే భక్తులు సంయమనం పాటించాలి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా



శ్రీశైలం/నంద్యాల, ఫిబ్రవరి 11(నంది పత్రిక):- శ్రీశైల బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం శ్రీశైలం కమాండ్ కంట్రోల్ రూంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం సమన్వయంతో దేవాదాయ, అటవీ, పోలీసు, రెవెన్యూ తదితర శాఖలు సమగ్ర చర్యలు చేపట్టాయని తెలిపారు. ఈ ఏడాది కాలినడకన వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. నిన్న ఒక్కరోజే స్వామి, అమ్మవార్లను సుమారు 71 వేల మంది భక్తులు దర్శించుకున్నారని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం స్పర్శ దర్శనం, అలంకార దర్శనం కోసం వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పర్శ దర్శనానికి కొంత సమయం ఎక్కువగా, అలంకార దర్శనం తక్కువ సమయంలో పూర్తవుతుందని చెప్పారు. అధిక రద్దీ కారణంగా దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టే అవకాశం ఉన్నందున భక్తులు సహనంతో వ్యవహరించాలని సూచించారు. శ్రీశైలం క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడు ఆధ్యాత్మిక భావనతో దర్శనానికి వస్తారని, అదే భక్తి భావాన్ని దర్శనం పూర్తయ్యే వరకు కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అలాగే క్షేత్ర పరిశుభ్రతను కాపాడేందుకు భక్తులు ఉపయోగించిన ఆహార పదార్థాల అవశేషాలు, ప్లాస్టిక్ వస్తువులను తప్పనిసరిగా డస్ట్‌బిన్స్‌లో వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల సహకారంతో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. రవాణా సౌకర్యం కోసం అదనంగా 460 బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఇతర శైవ క్షేత్రాల్లో కూడా ఇదే తరహా ఏర్పాట్లు చేపట్టామని, మహానంది క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.

# ఫిబ్రవరి 17 వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం




### 1-19 సంవత్సరాల లోపు విద్యార్థులందరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చూడాలి - జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, నంది పత్రిక....విద్యార్థులందరూ తప్పనిసరిగా నులి పురుగులు నివారించే అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో ఈ నెల 17 వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల ఫిబ్రవరి 17 వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1-19 సంవత్సరాల లోపు విద్యార్థులందరి చేత నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని కలెక్టర్ విద్యాశాఖల అధికారులను, ఐసిడిఎస్ పిడి ని ఆదేశించారు..అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటిఐ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులందరిచేత అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు కూడా వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 6 నెలలకు ఒక సారి 1సం. నుండి 19 సం.ల లోపు చిన్నారులకు, విద్యార్థులకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు..1సం. నుండి 2సం.లు ఉన్న చిన్నారులకు సగం మాత్ర, 3సం.ల నుండి 19సం.ల ఉన్న వారికి ఒక మాత్ర వేసుకోవాలన్నారు. నులిపురుగులు శరీరంలో ఉండడం వల్ల చదువులో ఏకాగ్రత లోపించడం, రక్తహీనత, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో పాటు అనేక రకాల అనారోగ్య సమస్యలు కూడా వస్తాయన్నారు. విద్యార్థులు ఈ మాత్రలు తీసుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రలను పిల్లలకు పంపిణీ జరుగుతుందని, ఒక వేళ ఆ రోజున మాత్రలు వేసుకోని పక్షంలో వారికి మాప్ అప్ కార్యక్రమం ద్వారా ఈనెల 24 వ తేదీన అల్బెండజోల్ మాత్రలను అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.భాస్కర్ రాజు, ఐసిడిఎస్ పిడి విజయ, సంబధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పన్నుల వసూళ్లకు సంబంధించి బకాయిల వసూలుపై కఠినంగా వ్యవహరించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, నంది పత్రిక.....జిల్లాలో పన్నుల వసూళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలపై కఠినంగా వ్యవహరించి వాటిని వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ ను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిఎస్టి అమలు చేయడంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్షన్ 51 ప్రకారం అన్ని ప్రభుత్వ విభాగాలు, స్థానిక సంస్థలు జిఎస్‌టి రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. అదే విధంగా వారు ప్రతి నెల 20వ తేదీ లోపు రిటర్న్స్ ఫైల్ చేయాలన్నారు. లావాదేవీలు లేకపోయినా 'నిల్' రిటర్న్స్ దాఖలు చేయడం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో కొనసాగుతున్న అన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వివరాలను కమర్షియల్ ట్యాక్స్ వారికి అందించాలని, తద్వారా కాంట్రాక్టర్లు సరిగ్గా పన్నులు చెల్లిస్తున్నారో లేదో తనిఖీ చేయవచ్చని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నకిలీ బిల్లులతో వ్యాపారం చేస్తూ పన్ను ఎగవేస్తున్న 'బోగస్ డీలర్ల'పై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. మైనింగ్ లైసెన్సులు ఇచ్చే ముందే రిజిస్ట్రేషన్ వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ మైన్స్ అధికారులను ఆదేశించారు. బకాయిలు ఉన్న వారి ఆస్తులకు సంబంధించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తుల బదిలీ జరగకుండా రిజిస్ట్రేషన్ శాఖ, అలాగే నిధుల రికవరీ కోసం బ్యాంకర్లు కమర్షియల్ ట్యాక్స్ శాఖకు తగిన సహకారం అందచేయాలన్నారు. ఇంజనీరింగ్ విభాగాల్లో (=&దీ, పంచాయతీ రాజ్ మొదలైనవి) +ూ రిజిస్ట్రేషన్ ఉంటేనే టెండర్లు కేటాయించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. +ూ రేట్లు తగ్గినప్పుడు ఆ ప్రయోజనం నేరుగా వినియోగదారులకు అందుతుందో లేదో లీగల్ మెట్రాలజీ అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ మాట్లాడుతూ పన్నుల వసూళ్ళు, బకాయిలు తదితర అంశాల గురించి వివరించారు .సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు సంతృప్తి చెందేలా ప్రభుత్వ శాఖలు సేవలను అందించాలి

### జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, నంది పత్రిక.....ప్రజలు సంతృప్తి చెందేలా ఆయా ప్రభుత్వ శాఖలు సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి సేకరిస్తున్న ఫీడ్ బ్యాక్ సానుకూలంగా వచ్చే విధంగా ఆయా శాఖలు మంచి సేవలను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంలో జిల్లా ర్యాంక్ ముందు స్థానంలో ఉండాలని కలెక్టర్ సూచించారు. రేషన్ కు సంబంధించి రేషన్ సరుకులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, అలాగే సరుకుల నాణ్యత బాగుండేలా చూడాలని డీఎస్ఓను ఆదేశించారు. దీపం కు సంబంధించి గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రవర్తన మర్యాదగా ఉండాలని, బిల్లు మొత్తం కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేయకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఎస్వో ను ఆదేశించారు. విద్యుత్ సేవలకు సంబంధించి విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండి, విద్యుత్ సరఫరా లో లోపాలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ ఈ ని ఆదేశించారు. పాఠశాల విద్యకు సంబంధించి పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరయ్యేలా చూడాలని, పిల్లలకు అర్థమయ్యేలా విద్యాబోధన ఉండాలని కలెక్టర్ డిఇఓ ను ఆదేశించారు.. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని, రుచి, నాణ్యత బాగుండాలని, వేరు శనగ చిక్కి కూడా నాణ్యతగా ఉండేలా చూడాలని కలెక్టర్ డిఇఓ ను ఆదేశించారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ల ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని,కచ్చితంగా హాజరు నమోదు చేయాలని కలెక్టర్ జడ్పీ సీఈవో ను ఆదేశించారు.. ప్రజలకు మంచి సేవలు అందించి రిజిస్ట్రేషన్ శాఖ కు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ జిల్లా రిజిస్ట్రార్ ను ఆదేశించారు..సమావేశంలో జడ్పీ సీఈవో నాసర రెడ్డి, డీఎస్వో రాజా రఘువీర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఈ ప్రదీప్ కుమార్, డిఇఓ సుధాకర్, సమగ్ర శిక్ష ఏపీసీ లోకరాజు, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల పేరిట వచ్చే నకిలీ వెబ్ సైట్ లు, యాప్ లు నమ్మవద్దు.

### భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్



కర్నూలు నంది పత్రిక.... మహ శివరాత్రి సంధర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సైబర్ నేరగాళ్లు ఆలయాల పేరిట నకిలీ వెబ్‌సైట్లు, యాప్ లు సృష్టించి మోసాలకు పాల్పడతారని భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ బుధవారం తెలిపారు. వివిధ శైవ క్షేత్రాలకు భారీగా భక్తులు తరలివెళ్లే అవకాశం ఉన్నందున, ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకొని కొందరు సైబర్ నేరగాళ్లు సత్రాలు లేదా వసతి గదుల బుకింగ్ , ఆన్‌లైన్ దర్శన టికెట్లు,ప్రత్యేక పూజల పేర్లతో నకిలీ వెబ్‌సైట్లు, లింకులు సృష్టించి మోసాలకు పాల్పడుతుంటున్నారన్నారు.భక్తులు, ప్రజలు ఈ సంధర్భంగా కింది సూచనలను తప్పనిసరిగా పాటించాలని కర్నూలు ఎస్పీ తెలిపారు. దర్శన టికెట్లు , సత్రాలు లేదా గదులు, ప్రత్యేక పూజల బుకింగ్ కోసం కేవలం అధికారిక ఆలయ వెబ్‌సైట్లు లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన యాప్‌లను మాత్రమే ఉపయోగించాలి. సోషల్ మీడియా, వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే అనుమానాస్పద లేదా తెలియని లింకులపై క్లిక్ చేయకూడదు. తక్కువ ధరలతో సోషల్ మీడియాలో ఫేస్బుక్, ఇన్ స్టాగ్రామ్ టెలిగ్రాశీ లలో వచ్చే ప్రకటనలను నమ్మకూడదు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబర్, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోకూడదు.

**ఆన్‌లైన్ చెల్లింపులు కన్ఫర్మేషన్ మెసేజ్‌ను పరిశీలించాలి.** బ్యాంక్ అధికారులు, దేవాలయ సిబ్బంది ఎప్పుడూ లు లేదా పిన్ నంబర్లు అడగరు.ఏదైనా సైబర్ మోసానికి గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలి లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.భక్తులందరూ అప్రమత్తంగా ఉండి, సురక్షితంగా మహా శివరాత్రి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు.

# చేతివాటం

## లింగాపురంలో యూరియా బస్తాలు మాయం



బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 11: రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేసే విషయంలో ఓ గ్రామ వ్యవసాయ సహాయ అధికారికి చేదు అనుభవం ఎదురయింది. రైతులకు సకాలంలో ఎరువులు అందించాలన్న తాపత్రయంతో ఇబ్బందులు పడిన అధికారికి అవస్థలు తప్పలేదు. పంపిణీ సమయంలో కొందరు వ్యక్తులు చేతివాటాన్ని ప్రదర్శించడంతో యూరియా బస్తాలు మాయం కా వడంతో ఏమి చేయాలో పాలు పోక ఆ అధికారి ఆందోళనకు గురైన సంఘటన బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న లింగాపురం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు గాను గ్రామ వ్యవసాయ సహాయ అధికారి చిన్న మధు పూనుకున్నారు. ప్రారంభంలోనే పంపిణీ సమయంలో తోపులాట జరగడంతో యూరియా పంపిణీ కొంతసేపు నిలిపివేశారు. తోపులాట విషయంపై కొందరు ఎస్ఐ జగన్మోహన్ కు సమాచారం అందజేయడంతో ముగ్గురు పోలీసులను లింగాపురానికి పంపడం జరిగింది. పోలీసులు అక్కడికి చేరుకున్న తర్వాత యూరియా పంపిణీ పూనుకున్నారు. సచివాలయం వద్ద టోకెన్లు ఇస్తూ ఉండగా సచివాలయం వెనక ఉన్న గోడౌనులో రైతుల వద్దనున్న టోకను తీసుకొని యూరియా బస్తాలను పంపిణీ చేసే పనికి పూనుకున్నారు. గో డౌన్ వద్ద గాలి చెన్నయ్యపాలెం గ్రామానికి చెందిన మోటబోతుల బాబు అనే వ్యక్తి ఏర్పాటు చేసుకొని బస్తాలను రైతులకు పంపిణీ చేసే ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంతలో ఓ రైతు సచివాలయానికి వచ్చి తనకు ఇంకా తొమ్మిది బస్తాల యూరియా ఇవ్వాల్సి ఉందని వీఏ ఏకు చెప్పడంతో వీఏఏ మధు గోడౌన్ కి వచ్చి చూసేసరికి అక్కడ యూరియా బస్తాలు లేకపోవడంతో ఖంగు తిన్నారు. సచివాలయానికి వచ్చి చూస్తే లెక్కల్లో తేడా కనబడింది. యూరియా బస్తాలు మాయమయ్యాయని గుర్తించిన వీఏఏ విషాదంలో పడిపోయారు. గ్రామంలో మొత్తం 40 మంది రైతులకు టోకన్లు ఇచ్చిన మేరకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. గ్రామానికి 532 యూరియా బస్తాలు రాగా 467 బస్తాలకు సరిపడా లెక్క తేలింది. మిగతా 72 బస్తాల యూరియా మాత్రం మాయమైంది. తర్వాత లెక్క చేయగా మరో పదహైదు బస్తాలకు లెక్క తేలింది కానీ, మిగతా 57 బస్తాలు మాత్రం మాయమయ్యాయని గుర్తించారు. రైతులకు సహాయం చేయాలని వస్తే, యూరియా బస్తాలు మాయం అయ్యాయ అన్న విషయాన్ని విఏఏ చిన్న మధు జీర్ణించు కోలేకపోయారు. మాయమైన 57 బస్తాలకు సంబంధించి దాదాపు 15వేల రూపాయల ను ప్రభుత్వ ఖజానాకు విఏఏ చెల్లించాల్సి రావడం దుంˆదృష్ట కరమైన విషయం. ఏం చేస్తాం! జేబులో నుంచి తీసి కడతానంటూ చిన్న మధు విచారం వ్యక్తం చేశారు.




# ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాలల సంరక్షణ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, జిల్లాలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలు, జువెనైల్ జస్టిస్ చట్టం–2015 ప్రకారం సక్రమంగా పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. నిబంధనల అమలులో ఎలాంటి లోపాలు ఉన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ లో బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ కు సంబంధించిన జిల్లా స్థాయి సిఫార్సుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ 4 బాలల సంరక్షణ కేంద్రాలను ఆమోదించింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల భద్రత, ఆరోగ్యం, విద్య, ఆహారం, నివాస వసతి, వంటి అంశాలు అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలన్నారు. ప్రైవేట్ బాలల సంరక్షణ కేంద్రాలకు సంబంధించి పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాలను తరచు తనిఖీ లు చేయాలన్నారు. . ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే కేంద్రాలు అన్నీ సమర్థంగా పనిచేయాలని పేర్కొన్నారు.. బాలలపై నిర్లక్ష్యం, సౌకర్యాల లోపం వంటి అంశాలు ఏ సంస్థలోనైనా తలెత్తితే సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల భవిష్యత్తు కోసం ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ, దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాయిస్ ఫాతిమా, సిపిఒ భారతి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శారద, జిల్లా చైల్డ్ ప్రొహిబిషన్ అధికారి దివాకర్, పోలీస్ శాఖ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో మెడికల్ మాఫియాను అరికట్టాలి




**-ప్రజారోగ్యాన్ని కాపాడాలి**

**-కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన పి పి పి విధానాన్ని రద్దు చేయాలి**

నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 11 . (నంది పత్రిక ):రాష్ట్రంలో మెడికల్ మాఫియాని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని. కూటమి ప్రభుత్వం తెచ్చిన పిపిపి విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో భారీగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి. ఎన్. రంగ నాయుడు. పిలుపు నిచ్చారు.పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయం నందు వాల్ పోస్టర్. విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యదర్శి. ఎన్. రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్. బాబా ఫక్రుద్దీన్. జిల్లా కార్యదర్శి నాగరాముడు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి. జి. సోమన్న. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు. భూమని. శ్రీనివాసులు. జి. లక్ష్మి దేవి. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి. డి. శ్రీనివాసులు. ఆంధ్రప్రదేశ్ వ్యవ సాయ కార్మిక సంఘం. వర్కింగ్ ప్రసిడెంట్. జి. హరనాథ్. ఉపాధ్యక్షులు. శశిధర్ రెడ్డి. పాల్గొన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ రాష్ట్రం. జిల్లాలో చిన్న ఆర్ఎంపి మొదలు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వరకు, గల్లీ మందుల దుకాణం మొదలు చెయిన్ ఫార్మసీల వరకు, చిన్న ల్యాబ్ మొదలు పెద్ద పెద్ద డయాగ్నోస్టిక్ సెంటర్లలో కమీషన్ల కోసం చేసే దందాలు అన్నీ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పేదవాళ్ల నడ్డి విరిచేస్తున్నాయని. నామమాత్ర ఆరోగ్య శ్రీ, ఎన్టీఆర్ వైద్య సేవల నిర్వహణతో రోగులు తప్పనిసరిగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుండడంతో మెడికల్ మాఫియా చెలరేగిపోతోందని సంబంధిత వృత్తిదారుల విద్యా ప్రమాణాల మొదలు వారి వృత్తి నియామకాలు, పరిరక్షణ, ప్రభుత్వం నిర్దేశించిన స్టయిఫండ్ ఎగగొట్టడం (మెడికల్ కాలేజీలలో దీని విలువ రూ.300 నుంచి రూ.500 కోట్లు) ఇలా ఎన్నో అంశాలలో అక్రమాలు జరుగుతున్నాయని ఇటీవలి కాలంలో పేట్రేగిపోతున్న మెడికల్ మాఫియా నేరుగా ఫార్మసీ కౌన్సిల్ను ఆక్రమించిన విధానం తీవ్ర ఆక్షేపణీయం. సంబంధిత ఫార్మసిస్ట్ సంఘాలు తెలిపిన పలు విషయాలతో మెడికల్ మాఫియాలో ఎన్నో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఐ ఇప్పటికే ప్రభుత్వ అధికారులను కోరటం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్–ప్రైవేట్–పార్టనర్షిప్ (పిపిపి) పేరుతో మెడికల్ కాలేజీలను, అనుబంధ ఆసుపత్రులను ప్రైవేటు శక్తులకు అప్పగించడంతో పేద, సామాన్య మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణ: పేద విద్యార్థులకు వైద్య విద్య ప్రశ్నార్థకంగా మారింది. మెడికల్ మాఫియా అక్రమాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నరని ఈ పరిస్థితుల్లో పలు కార్పొరేట్ ఆసుపత్రులలో శిక్షణ పొందిన నర్సులు, ఫార్మసిస్టుల స్థానంలో ఏమాత్రం అర్హతలేని వ్యక్తులతో పనిచేయిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ మాఫియాపై ప్రజలకు అవగాహన కల్పించాలి. మెడికల్ మాఫియాపై ప్రజల్లో చైతన్యం కలిగించి మహత్తర ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి మందుల ధరల్లో వ్యత్యాసాలు, ఫార్మా కంపెనీల ఆగడాలు, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడికి అడ్డుకట్టవేయాలని: మెడికల్ మాఫియా ఆగడాలు అరికట్టి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని, ఆరోగ్యశ్రీని తగు నిధులు విడుదల చేసి సక్రమంగా అమలు జరిగేలా చూడాలని; మెడికల్ కాలేజీల పిపిపి విధానానికి స్వస్తిపలికి, ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14వ తేదీన రాష్ట్ర సమితి పిలుపుమేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో ఆందోళనలు చేపట్టడం జరుగుతుందని ఈ ఆందోళనా కార్యక్రమాల్లో యావన్మంది ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పిలుపు నిచ్చారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు ఓటర్లు సహకరించాలి

### కర్నూలు నియోజకవర్గ ఆర్వో & కమిషనర్ పి.విశ్వనాథ్

### ఎస్ఐఆర్ పురోగతిపై బిఎల్వోలతో టెలికాన్ఫరెన్స్



కర్నూలు నంది పత్రిక.... భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్–సర్) ప్రక్రియకు ఓటర్లు సహకరించాలని ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి & నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై నియోజకవర్గ బిఎల్వోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ప్రీ–ఇంటెన్సివ్ రివిజన్ సర్వే పురోగతిని సమీక్షించారు. దిగువన ఉన్న పోలింగ్ కేంద్రాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు మైక్ ప్రకటనలు, బ్యానర్ల ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు.అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలని ఆదేశించారు. డూప్లికేట్ నమోదులు, మరణించిన వారి పేర్లు మరియు అనర్హుల వివరాలను తొలగించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణలో ఖచ్చితత్వం అత్యంత కీలకమని తెలిపారు. బిఎల్వోలు ఇంటింటికీ వెళ్లి వివరాలను ధృవీకరిస్తూ పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు.కొత్తగా పద్దెనిమిది సంవత్సరాలు పూర్తి చేసిన యువత వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. బిఎల్వోలు ఇంటికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, చిరునామా ధృవీకరణ పత్రాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. వివరాల్లో తప్పులు ఉంటే సంబంధిత బిఎల్వోలను సంప్రదించి సరిచేయించుకోవాలని సూచించారు. ఖచ్చితమైన ఓటరు జాబితా న్యాయమైన ఎన్నికలకు పునాదిగా నిలుస్తుందని చెప్పారు. సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950 కు కాల్ చేయవచ్చని లేదా వెబ్‌సైట్లు సందర్శించవచ్చని తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

### రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి

చిత్తూరు జిల్లా బ్యూరో, ( నంది పత్రిక ) ఫిబ్రవరి 11 : కుప్పం మండల పరిధిలోని చెక్కునత్తం పంచాయతీ లోని లక్ష్మమ్మ, రాజప్ప గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేసుకోలేక ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్నారు. రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి చొరవతో అనారోగ్యంతో బాధ పడుతున్న బాధితులైన లక్ష్మమ్మ, రాజప్పకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరపున రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కకునత్తం మణి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. మణి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అనారోగ్యంతో బాధపడే ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదు కుంటుందని పేర్కొన్నారు. అలాగే పేదల పక్షంలో నిలబడే రాష్ట్ర ప్రభుత్వంకు మనందరం రుణపడి ఉండాలని కోరారు. అనంతరం లక్ష్మమ్మ రాజప్ప మాట్లాడుతూ... తాము అనారోగ్య పరిస్థితిలో ఉన్నామని గుర్తించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమను ఆదుకొన్న రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ శ్రీనివాసులు, మండల యువత అధ్యక్షులు కనకరాజు, యూనిట్ ఇన్చార్జి శివకుమార్, పార్టీ అధ్యక్షులు బీరప్ప, భూత్ ఇన్చార్జిలో వినోద్, రాము, వెంకటాచలం, తిమ్మప్ప, ధనప్ప, సుబ్రమణి, మాదేశ్, పళని, రామస్వామి పాల్గొన్నారు.



# చుక్కల భూములకు అరుంధతి చూపిస్తామన్న ప్రభుత్వం రైతుల కళ్లలో మాత్రం ఇంకా చీకటే

### పరిష్కారంలో విఫలం రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షులు వి.వి.నాయుడు

కర్నూలు నంది పత్రిక.... రాష్ట్రంలో రెవెన్యూ ప్రక్షాళన పేరుతో ఊదరగొట్టిన డంకాలు మోగుతూనే ఉన్నాయి. సభల మీద సభలు, ప్రకటనల మీద ప్రకటనలు. “చుక్కల భూముల సమస్యలను ఆగమేగాల మీద పరిష్కరిస్తాం” అని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి పదే పదే భరోసా ఇస్తున్నారు. స్పెషల్ క్యాంపులు, రెవెన్యూ క్లీనిక్‌లు అంటూ భారీ ప్రకటనలు చేశారు. కానీ నేలమీద వాస్తవ పరిస్థితి ఏమిటి? అప్లికేషన్ తీసుకున్న తర్వాత ఆ ఫైళ్లకు గతి ఏమిటి? అన్న ప్రశ్నలకు మాత్రం సమాధానం కనిపించడంలేదు.కర్నూలు నగరంలోని బిర్లా కంపౌండ్ కార్యాలయంలో రైతులతో సమావేశమైన రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షుడు వి.వి.నాయుడు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “ప్రక్షాళన చేశామని సభల్లో చెప్పడం సులువు. కానీ జిల్లా స్థాయిలో అధికారులు వాస్తవ నివేదికలు పంపుతున్నారా? వేలల్లో వచ్చిన అప్లికేషన్‌లపై ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి?” అని ప్రశ్నించారు. రెవెన్యూ స్పెషల్ క్యాంపుల పేరుతో హడావుడిగా దరఖాస్తులు స్వీకరించి, తర్వాత వాటిని మూలకు నెట్టేస్తే అది ప్రక్షాళన కాదని, రైతులతో ఆటలాడటమేనని మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంటే, మరోవైపు జిల్లా అధికారులు నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆశయాలకే చెడ్డపేరు తెస్తున్నారని అన్నారు.ప్రతి నెల పెన్షన్ పంపిణీకి రాజకీయ నాయకులు, అధికారులు సభలు పెడతారు. కొత్త పాసుబుక్కుల పంపిణీకి టార్గెట్లు పెడతారు. కానీ భూముల అసలు సమస్యల పరిష్కారానికి మాత్రం టార్గెట్ ఎందుకు ఉండదని వి.వి.నాయుడు నిలదీశారు. “రైతు తన పాసుబుక్‌ను స్వయంగా వచ్చి తీసుకుపోతాడు. కానీ అతని భూమి రికార్డు సరిచేయడానికి ప్రభుత్వానికి ఉత్సాహం ఎందుకు ఉండదు?” అని ప్రశ్నించారు.రీ–సర్వే అనంతరం గతంలో పట్టా భూములుగా ఉన్న అనేక భూములు ‘ప్రభుత్వ భూమి’గా మారిపోయాయని, మ్యూటేషన్ ప్రక్రియను ఏడాదిన్నరగా నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. మ్యూటేషన్ సైట్‌నే ఓపెన్ చేయకుండా రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పడం అమానుషమని అన్నారు.గార్గేయపురం గ్రామానికి చెందిన రైతు వెంకటరెడ్డి తన బాధను వివరించారు. సర్వే నంబర్లు 619/3, 402⁄సూలో ఉన్న తమ భూములకు 1932 కంటే ముందున్న రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆర్.హెచ్‌లు ఉన్నప్పటికీ, రీ–సర్వే తర్వాత పేర్లు తొలగిపోయి ‘ప్రభుత్వ భూమి’గా నమోదు చేశారని చెప్పారు. ఇదే సర్వే నంబరులో ఒక రియల్టర్ కొనుగోలు చేసిన భూమిని మాత్రం గత కలెక్టర్ పట్టాగా మార్చి, మిగతా రైతుల భూములను అలాగే వదిలేశారని ఆరోపించారు. “మాది కూడా అదే సర్వే నంబర్. అయితే మాకు న్యాయం ఎందుకు లేదు?” అని ప్రశ్నించారు.కల్లూరు మండలానికి చెందిన రైతు వెంకటేష్ మాట్లాడుతూ, తమ మండలంలో కూడా చుక్కల భూముల సమస్యలపై అప్లికేషన్‌లు తీసుకున్నప్పటికీ ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని తెలిపారు. “సభల్లో చెప్పే మాటలు, ఫీల్డ్‌లో జరిగే చర్యలు రెండూ పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి” అని వ్యాఖ్యానించారు. వి.వి.నాయుడు మాట్లాడుతూ రైతుల వేదన స్పష్టంగా చెబుతోంది ప్రభుత్వ ప్రకటనలు అరుంధతి నక్షత్రంలా దూరంలో మెరిసిపోతున్నాయి. కానీ రైతు భూమి రికార్డుల్లో మాత్రం చీకటి తొలగలేదు. రెవెన్యూ సంస్కరణలు కాగితాలకే పరిమితమైతే, అది ప్రక్షాళన కాదు ప్రజల విశ్వాసానికి ద్రోహం అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జిల్లా వారీగా వచ్చిన అప్లికేషన్‌ల సంఖ్య, పరిష్కరించిన కేసులు, పెండింగ్‌లో ఉన్నవి పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలి. రీ–సర్వే లోపాలపై ప్రత్యేక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. యుద్ధప్రాతిపదికన మ్యూటేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలి అన్నారు. లేకపోతే “చుక్కల భూముల సమస్యలకు పరిష్కారం” అన్న హామీ మరో రాజకీయ నినాదంగా మిగిలిపోతుంది. రైతు మాత్రం న్యాయం కోసం అదే కార్యాలయ మెట్లపై తిరుగుతూనే ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమం లో రైతులు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



## పోషకాహారంతో కంటి చూపు మెరుగుపడుతుంది
## 80 మంది విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ



**బద్వేల్, ఫిబ్రవరి 11 (నంది పత్రిక ):**పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే కంటి చూపు మెరుగుపడుతుందని కంటి వైద్య అధికారి హుస్సేనయ్య తెలిపారు. పట్టణంలోని బాలుర హైస్కూల్లో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఆకుకూరలు, కాయగూరలు సమృద్ధిగా తీసుకోవాలని సూచించారు. బయట లభించే పదార్థాలు, పానీపూరి వంటి ఆహారాలను పూర్తిగా మానివేయాలని చెప్పారు. విద్యార్థి దశలోనే కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలుర హైస్కూల్ హెడ్‌మాస్టర్ వెంకటసుబ్బారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ అరిగి రామయ్య, వైద్య సిబ్బంది సుధా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సుమారు 80 మంది విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు.

## పనులు కల్పించాలి
### -వలసలు నివారించేందుకు చర్యలు



**కొత్తపల్లి - నంది పత్రిక :** గ్రామాలలో జాబుకార్డుకలిగిన ప్రతి ఒక్కరికి అడిగిన వెంటనే పనులు కల్పించాలని ఏపీఓ విమలమ్మ సూచించారు. బుధవారం స్థానిక ఎన్ఆర్జీఎస్ సమావేశభవనంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరికి తప్పకుండా అడిన వెంటనే పనులు కల్పించేందుకు సిద్ధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాలన్నారు. గ్రామాల నుంచి ఎవ్వరుకూడా వలసలు వెల్లకుండా నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఈ ఏడాది మార్చిలోపు పూర్తిఅయిన పనులను క్లోజర్ వర్క్సునుంచి తీసీవేయాలని సూచించారు. వలసల నివారణకు ప్రతి ఒక్కరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలనుంచి ఎటువంటి పిర్యాదులు వేతనదారులనుంచి రాకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు అక్షరాంధ్ర కార్యక్రమం హాజరును ప్రతి రోజు ఆన్లైన్ ద్వారా పంపాలన్నారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లకు పెన్సిల్లను పంపిణీ చేశారు.

## జిసి పాలెం లో కాలువ పూడిక తీత పనులు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 11:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న గాలి చెన్నయ్యపాలెం గ్రామంలో కాలువ పూడికతీత పనులు జరుగుతూ ఉన్నాయి. గ్రామ పంచాయతీ సర్పంచ్ కంచర్ల శోభారాణి, ఉప సర్పంచ్ కంచర్ల లింగారెడ్డి ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో బుధవారం కాలువ పూడిక తీత పనులను చేపడుతున్నారు. గతంలో హరితరాయబారుల ద్వారా కాలువలో పూడికతీత పనులు జరుగుతూ ఉండేవి. వర్షాకాలంలో వర్షపు నీరు ప్రవహించి కాలువలు పూడి పోవడంతో ప్రత్యేకంగా ప్రోక్కులైనర్ ను తెప్పించి పూడిక తీత పనులను చేపడుతున్నారు. దాదాపు 400 మీటర్ల పొడవులో పూడిపోయిన కాలువలలో పూడిక తీత పనులను చేపడుతున్నామని ఉపసర్పంచ్ కంచర్ల లింగారెడ్డి బుధవారం రాత్రి తెలిపారు.



## పార్వతీపురం కాలనీలో 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

**మహానంది ఫిబ్రవరి 11 (నంది పత్రిక):-** మహానందీశ్వర స్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఏఈ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మహానంది లోని పార్వతీపురం కాలనీలో 100 కేవీ ట్రాన్స్ఫార్మర్లను నూతనంగా ఏర్పాటు చేశారు. ప్రతి విద్యుత్ ట్రాన్స్ఫారం దగ్గర విద్యుత్ సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు.బ్రహ్మోత్సవాలలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేసేలా ఏర్పాటు చేశామన్నారు.



## ఘనంగా 'ఆర్థిక అక్షరాస్యత వారం-2026' నిర్వహణ



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 11 ( నంది పత్రిక )** శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల వేదికగా బుధవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో "ఆర్థిక అక్షరాస్యత వారం – 2026" అవగాహన సదస్సు అత్యంత ఉత్సాహభరితంగా సాగింది.కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆర్థిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. బ్యాంకింగ్ రంగంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి, ఆర్థిక మోసాల బారిన పడకుండా ఉండటానికి ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ మంచి అవకాశాన్ని కల్పించిన యూనియన్ బ్యాంక్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరో ముఖ్య అతిథి ఎం. రవీందర్ కుమార్ మాట్లాడుతూ కె. వై .సి .ప్రాముఖ్యతను వివరించారు. బ్యాంకు ఖాతా తెరవడానికి, లావాదేవీల రక్షణకు ఇది ఎంత అవసరమో వివరించారు. 14 అంకెలతో కూడిన 'సెంట్రల్ నో యువర్ కస్టమర్' ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. పదేళ్ల పాటు ఖాతాలో ఎటువంటి లావాదేవీలు జరపని పక్షంలో, ఆ నిధులు ఆర్‌బీఐ పరిధిలోకి వెళ్తాయని హెచ్చరించారు. జనవరి 2026 నాటికి సుమారు ₹72,454 కోట్లు ఇలా ఆర్‌బీఐ స్వాధీనంలో ఉన్నాయని గణాంకాలతో సహా వివరించారు. సదస్సు అనంతరం విద్యార్థులకు ఆర్థిక అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో చురుగ్గా పాల్గొని సమాధానాలు ఇచ్చారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు కార్యక్రమ ముగింపులో అతిథులు ఎం. రవీందర్ కుమార్ , బి. అరుణకుమారి , పి. డివైజ్ , ఎస్. పాండే లను కళాశాల చైర్మన్, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులపై సర్వేల భారం తగ్గించాలి

**ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య**
**మరణించిన సచివాలయ ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి**
**సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరకు ప్రభుత్వం చొరవ చూపాలి**

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి11(నంది పత్రిక):-** గ్రామ వార్డు (స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు) సచివాలయ ఉద్యోగులపై సర్వేల భారం తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.గురుస్వామి మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు రోజురోజుకు సర్వేల భారం వెంటనే తగ్గించాలని,ఈ విధంగా రోజురోజుకు పెరుగుతున్న సర్వేల వల్ల ఒకే రోజు రెండు మరియు మూడు సర్వేలు ఒకే సమయంలో చేయాలని అధికారులు అదేశాలు ఇవ్వడంతో ఉద్యోగులు పనిభారంతో ఒత్తిడికి గురై గత మూడు నెలల నుంచి సగటున రోజుకు ఒకరు చొప్పున ఉద్యోగులు మరణిస్తున్నప్పటికి సర్వేల భారం రోజురోజుకు మరింత పెరుగుతుందే తప్ప తగ్గడం లేదని దీనివల్ల రోజుకో ఉద్యోగి ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సచివాలయ ఉద్యోగులకు సర్వేల భారం తగ్గించి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు సహాయం అందించి వారి వారసులకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామనితెలిపారు.

నూతన ప్రభుత్వం ఏర్పడిన రోజు నుండి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నప్పటికీ వాటిని పక్కనపెట్టి రోజురోజుకు ఉద్యోగులపై సర్వేల భారాన్ని పెంచడం కక్షపూరితంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులపై సర్వేల భారం తగ్గించి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులందరిని వారి యొక్క మాతృశాఖలకు అప్పజెప్పి,నిర్ధిష్ట ప్రమోషన్ ఛానల్ ప్రకటించాలి.అదేవిధంగా అన్ని శాఖల ఉద్యోగుల యొక్క సీనియారిటీ జాబితాను ప్రకటించి అర్హులైన వారికి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలి.గత ప్రభుత్వంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఆలస్యంగా జరపడం వల్ల నష్టపోయిన 9నెలల వేతనాలను అరియర్స్ రూపంలో వెంటనే చెల్లించాలి.గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల యొక్క జాయినింగ్ తేదీ నుండి సర్వీసును లెక్కించి ఇవ్వవలసిన నొషన్ ఇంక్రిమెంట్లు వెంటనే ఇవ్వాలని,గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్ల విధివిధానాల కోరకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం వెంటనే మరోసారి

నిర్వహించి ప్రమోషన్ ఛానల్ ను వెంటనే ప్రకటించాలని,గతంలో ఇంటింటి సర్వే తప్పనిసరి చేస్తూ జారీ చేసిన జీవో నెం.11 సవరించి అత్యవసర సమయంలో మాత్రమే ఇంటింటి సర్వే తప్పనిసరి చేస్తూ సవరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

## ఏక పక్ష ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంటును వ్యతిరేకించండి.





**సి 2 +50 శాతం ప్రకారం పంటల మద్దతు ధరల చట్టం చేయాలి.**
**విత్తన విద్యుత్ చట్టాలను ఉపసంహరించాలి.**
**కౌలు రైతులకు అన్ని పథకాలు అమలయ్యే నూతన కౌలు చట్టాన్ని చేయాలి.**
**మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2005 ను పునరుద్దరించాలి.**
**ఉపాధి కూలీలకు 2 వందల రోజులు పని కల్పించి రోజు కూలీ 6 వందలు ఇవ్వాలి.**
**కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలి.**
**డిమాండ్ చేసిన ఎపి రైతు సంఘం.**

**బేతంచెర్ల ఫిబ్రవరి 11 ( నంది పత్రిక ).** ఎపి. రైతుసంఘం బేతంచెర్ల మండల కమిటి ఆధ్వర్యంలో బుధవారం నాడు బేతంచెర్ల, హెచ్ కొట్టాల, ఆర్ఎస్. రంగాపురం, అంబాపురం తదితర గ్రామాలలో, కేంద్ర మోదీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయి ఏక పక్షంగా అమెరికాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకుంటున్నదని, ఈ అగ్రిమెంటును రైతులు, కౌలు రైతులు,కార్మికులు వ్యవసాయ కార్మికులు, మేధావులు, విద్యావంతులు,ప్రజలు వ్యతిరేకించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి. సుబ్బరాయుడు, బేతంచెర్ల మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు సి. మద్దులేటీ స్వామి, పి. రామ మోహన్ కోరారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈ నెల 12 వ తేది ( గురువారం) నాడు, జరిగే దేశ వ్యాపిత కార్మిక సార్వత్రిక సమ్మెప్రజలందరూ లో పాల్గొని జయ ప్రదం చేయాలని కోరుతూ కర పత్రాలను పంపిణీ చేశారు. ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాధన్ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలని,ఈ మద్య కాలంలో కేంద్ర ప్రభుత్వం చేసిన విత్తన చట్టంను, విద్యుత్ చట్టంను ఉపసంహరించు కొనవలెనని కోరారు. ఈ చట్టాల అమలు వల్ల రైతులు, కౌలు రైతులు చాలా ఇబ్బందులకు గురవతారని తెలిపారు. అలాగే 2005 సం.లో,అప్పటి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం చేసిందన్నారు. గ్రామాలలోని పేదలు, కరువు కాటకాల వల్ల ఉన్న ఊర్లు వదలి, బ్రతుకు తెరువు కోసం,వలసలు పోకుండా బ్రతకడానికి ఈ చట్టం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని జి రాంజీ పేరుతో మార్చి, కేంద్ర బడ్జెట్ లో నిధులు తగ్గించి, భవిషత్తులో ఈ చట్టాన్ని ఎత్తి వేయాలని మార్పులు చేసి రాష్ట్రలపై భారం మోపుతున్నదని,బ్రిటిష్ కాలం నుండి కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న, 44 కార్మిక చట్టాలను మార్చి, 4 కోడ్లుగా చేసి కార్మికులను పారిశ్రామిక యాజమాన్యంనకు బానిసలుగా చేయుటకు పూనుకున్నదని,కార్మిక,ఉద్యోగ, రైతాంగ, ప్రజా సంక్షేమాలను మరిచి బహుళ జాతి కంపెనీలకు, అమెరికా సామ్రాజ్య వాదులకు ఊడిగం చేస్తున్న,కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే కార్మిక సమ్మెలో ప్రజలందరూ పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సమర్పణ దివస్.

**బేతంచెర్ల ఫిబ్రవరి 11 ( నందిపత్రిక).** భారతీయ జన సంఘ్ మాజీ అధ్యక్షులు, ఏకాత్మ మానవతావాదం రూపకర్త , కవి, రచయిత పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వారి వర్ధంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ బేతంచర్ల కార్యాలయం నందు బేతంచెర్ల ఉపాధ్యక్షుడు కోట్ల హరికృష్ణ, మండల టౌన్ ప్రధాన కార్యదర్శిలు రమేష్ బాబు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సమర్పణ దివాస్ ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా కార్యదర్శి నాగమోహన్ రెడ్డి, రమేష్ బాబు ఉపేంద్ర దీన్ దయాళ్ ఉపాధ్యాయ త్యాగాలను వారి యొక్క సేవలను నేటి తరాల వారు స్ఫూర్తిగా తీసుకొని ఆచరించడమే మనం వారికి అందించే నివాళి అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బేతంచెర్ల టౌన్ ప్రధాన కార్యదర్శి శంకర్ నాయుడు,కార్యదర్శులు టైలర్ రాముడు,మణికంత, నాగేంద్రప్ప,ఎస్సీ మోర్చా టౌన్ అధ్యక్షుడు ఎల్ల రాజు,ఓ. బి .సి మోర్చా జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్ ,బిజెపి నాయకులు మోహన్ రావు ,ఉపేంద్ర,అరుణ్ కుమార్,ఆర్ ఆర్ బ్రదర్స్, మండల ఓబీసీ నాయకుడు లాలాశివుడు బిజెపి నాయకులు కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళు లర్పించారు.



# ప్యాపిలికి కొత్త వెలుగులు..

## ఎమ్మెల్యే కోట్ల కృషితో జిగేల్ మంటున్న పట్టణం





**నంది పత్రిక -ప్యాపిలి** ప్యాపిలి పట్టణం సరికొత్త శోభను సంతరించుకుంది. గత కొంతకాలంగా చీకటిలో ఉన్న ప్రధాన రహదారులు ఇప్పుడు విద్యుత్ వెలుగులతో జిగేల్‌మంటున్నాయి. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో, 30 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన డివైడర్ లైట్లు వెలగడంతో పట్టణ రూపురేఖలే మారిపోయాయి. అత్యంత ఆకర్షణీయంగా డివైడర్ మార్గం పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్ల వెంబడి అత్యాధునిక ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా, ప్రమాదాలు నివారించేలా ఈ లైటింగ్ వ్యవస్థను డిజైన్ చేశారు. ఈ ఏర్పాటుతో ప్యాపిలి పట్టణం ఇప్పుడు నగరాన్ని తలపిస్తూ అత్యంత అందంగా, కాంతివంతంగా కనిపిస్తోంది. **ప్రజల హర్షం** ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై చూపిస్తున్న శ్రద్ధ పట్ల స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "చాలా కాలంగా ఎదురుచూస్తున్న డివైడర్ లైట్ల సమస్యను ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించారు. ఇప్పుడు రాత్రి వేళల్లో రోడ్లపై వెళ్లాలంటే భయం లేదు, పట్టణం కూడా చాలా కళకళలాడుతోంది," అని స్థానికులు పేర్కొంటున్నారు.

**అభివృద్ధి పథంలో డోన్ నియోజకవర్గం** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఎమ్మెల్యే కోట్ల ముందుకు సాగుతున్నారు. ప్యాపిలిలో జరిగిన ఈ అభివృద్ధి పనులు కేవలం ప్రారంభం మాత్రమేనని, రానున్న రోజుల్లో పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ 736 కోట్ల బీసీ విద్యార్థుల బకాయిల చెల్లింపు పై హర్షం.

## నాయిబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయ కుమార్



**కర్నూలు నంది పత్రిక......** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బిసి విద్యార్థిని,విద్యార్థుల పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిల కోసం 736 కోట్లు విడుదల చేయడము హర్షినియమని నాయబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పాలకవీటి విజయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి, రాష్ట్ర విద్య మరియు ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కృషితో విద్యార్థుల సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది పడకుండా నేరుగా కళాశాల ఖాతాలోకి నిధులు విడుదల చేసే సౌకర్యాన్ని కల్పించిందని పాలకవీటి విజయ కుమార్ అన్నారు.విద్యకు అడ్డంకులు ఉండకూడదనే సంకల్పంతో తీసుకున్న ఈ చర్యను హృదయపూర్వకంగా బీసీలు స్వాగతిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ మాటలలో కాకుండా కార్యచరణ రూపంలో చూపిస్తున్న నాయకత్వం యువతలో నమ్మకాన్ని పెంచుతుందని పాలకవీటి విజయకుమార్ అన్నారు. బీసీల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆయన అన్నారు.

# తండ్రికి తనయుని తరుపున పట్టువస్త్రాలు సమర్పణ





**మహానంది ఫిబ్రవరి 11 (నంది పత్రిక):-** మహానంది క్షేత్రంలో ఈనెల 13 నుంచి ప్రారంభమయ్యే శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కాణిపాకం వరసిద్ధి వినాయకుని దేవస్థానం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. కాణిపాకం ఈవో పెంచల కిషోర్ కుమార్,చైర్మన్ సురేంద్రబాబు,ధర్మకర్తల మండలి సభ్యులు, వేదపండితులు, ప్రధానార్చకులు,స్థానాచార్యులు మంగళవాయిద్యాలు, మేళతాళాలు,వేదమంత్రాలు నడుమ శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన వీరికి ఆలయ ముఖ మండపం వద్ద ఈవో శ్రీనివాస్ రెడ్డి సాధారంగా స్వాగతం పలికారు.అనంతరం పట్టు వస్త్రాలను ఈవో శ్రీనివాస్ రెడ్డికి అంద జేశారు.అలంకార మండపంలో ఈవో, చైర్మన్ లను మహానంది దేవస్థానం ఈవో శ్రీనివాస్ రెడ్డి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి,జ్ఞాపిక అందజేయగా వేద పండితులు వేద ఆశీర్వచనం అందించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు.



# బాలోత్సవాలను విజయవంతం చేయండి..

## ఈ నెల 13 సాయంత్రం లోగా విద్యార్థుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి..

**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 10 ( నంది పత్రిక )** ఈ నెల 17,18 తేదీలలో నంద్యాలలో ని మున్సిపల్ టౌన్ హాల్ నందు జరుగు నంది బాలోత్సవాలు పిల్లల సంబరాలను విజయవంతం చేయాలని నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ డి. మౌలాలి, నంది బాలోత్సవాల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డా. రాకేష్ రెడ్డి,అధ్యక్షులు డా. క్రాంతి చైతన్య, ప్రధాన కార్యదర్శి గురుస్వామి లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ బాలోత్సవాలలో పాల్గొను పాఠశాలల కు సంబందించిన విద్యార్థుల వివరాలను ఈవెంట్స్ వారీగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారు కోరారు.కల్చరల్ ఈవెంట్స్ లో శాస్త్రీయ నృత్యం, ఏకపాత్రాభినయం, ఫ్యాన్సీ డ్రస్ లఘు నాటిక, జానపద నృత్యం, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, కోలాటం వంటి కార్యక్రమాలు ఉండగా అకాడమీక్ లో సైన్స్ ఎగ్జిబిషన్ చిత్రలేఖనము వ్యాసరచన తెలుగు, వ్యాసరచన ఇంగ్లీష్, కథ రచన తెలుగు, కవితా రచన, ఉత్తరం రాయడం, సెల్ఫ్ బి ఇంగ్లీష్, మ్యాప్, ఉపన్యాసం తెలుగు, ఉపన్యాసం ఇంగ్లీషు,క్విజ్, తెలుగులో మాట్లాడటం, మెమొరీ టెస్ట్, పద్యం భావం, మట్టితో బొమ్మలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ బాలోత్సవాలు 17 వ తేదీన మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభ సభ ప్రారంభమౌతుందని,

అలాగే 18 వ తేదీన మధ్యాహ్నం 3:30 గంటలకు బహుమతుల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధులుగా రాష్ట్ర మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి ని, జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ లతోపాటు పట్టణంలోని ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ బాలోత్సవాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని, ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# కాలనీలో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



**జూపాడుబంగ్లా: ఫిబ్రవరి: 11: (నంది పత్రిక)** జూపాడు బంగ్లా గ్రామంలోని పింజరపేట కాలనీ వాసులు మంచినీటి కొరకు కేజీ రోడ్డుపై ధర్నా నిర్వహించడం జరిగింది. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గోపికృష్ణ స్పందించారు. పింజరి పేట కాలనీ ప్రజలకు నెలకొన్న తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను ప్రారంభించారు. కాలనీ ప్రజలకు తాగునీరు (మినరల్ వాటర్) ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. అలాగే వాడుకోవడానికి రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. త్వరలో శాశ్వత పరిష్కారం కొరకు పైపు లైనులకు మరమ్మతులకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ట్యాంకర్ వద్ద కాలనీవాసులు వరుస క్రమంలో వచ్చి నీటిని పట్టుకున్నారు. వాటర్ ట్యాంక్ ద్వారా మంచినీటిని సరఫరా చేయడం పట్ల పింజరి పేట కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్రబాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రజా సేవలో మరో ముందడుగు

## కాలనీవాసుల చిరకాల కల నెరవేర్చిన ఎమ్మెల్యే కోట్ల.



**బేతంచెర్ల ఫిబ్రవరి 11 ( నందిపత్రిక).** బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని 14వ వార్డు పరిధిలో గల సుందరయ్య కాలనీలో, 22-01-2026న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సీసీ రోడ్లు మరియు బోర్ పాయింట్‌కు పూజ కార్యక్రమం (శంకుస్థాపన) నిర్వహించారు. మంగళవారం (11-02-2026) డోన్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు,సుందరయ్య కాలనీలో బోర్ వేయించడం జరిగింది. బోర్ ద్వారా సుమారు 4 ఇంచుల నీరు లభించిందని బేతంచెర్ల నగర పంచాయతి కమిషనర్ డి. హరిప్రసాద్ మరియు స్థానిక టిడిపి నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా కాలనీలో నివసిస్తున్నప్పటికీ, సరైన నీటి సరఫరా లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి సీసీ రోడ్లు మరియు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నందుకు కాలనీవాసులందరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రీ రాజరాజేశ్వరి పాఠశాలలో ఘనంగా జరిగిన సొసైటీ డే కార్యక్రమం

**నంది పత్రిక గడివేముల** గడివేముల లోని స్థానిక పాఠశాల శ్రీ రాజరాజేశ్వరి పాఠశాలలో సొసైటీ డే కార్యక్రమం చాలా ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా డి. ఇ. ఓ.పి. జనార్ధన్ రెడ్డి.ఉర్దూ డివిజనల్ ఇన్స్పెక్టర్ అస్మాద్దీన్ , ఎస్సై సి .నాగార్జున రెడ్డి. పాఠశాల కరస్పాండెంట్ ఎం. రామేశ్వరరావు మరియు ఏ.వో. శ్రీ ఎం.బీ.ఎన్. రాఘవేంద్రరావు గారు ఈ వేదికను అలంకరించారు. ఈ కార్యక్రమంలో మొదటగా డి. ఇ. ఓ.పి. జనార్ధన్ రెడ్డి.మాట్లాడుతూ మన జీవితంలో మనం ఎదుగుతున్నామంటే దానికి కారణం ఈ సమాజమే. కానీ ఎదిగిన తర్వాత సమాజానికి మనం ఏమి తిరిగిస్తున్నాం అని ఆలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనం చిన్నగా మొదలుపెట్టిన మార్పు రేపు గొప్ప సత్ఫలితాలను ఇస్తుంది. మన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడమే మనం సమాజానికి ఇచ్చే గౌరవం అని తెలియజేశారు. తర్వాత ఉర్దూ డివిజనల్ ఇన్స్పెక్టర్ ఎస్.అస్మద్దీన్ సార్ మాట్లాడుతూ సమాజంలో విద్య వలన మనకు జ్ఞానం నైపుణ్యం ఆత్మవిశ్వాసం మన జీవన ప్రమాణాన్ని మెరుగుపరుస్తుంది మంచివిద్య మంచి భావితరానికి పునాది అని సూచించారు. తర్వాత ఎస్సై నాగార్జున్ రెడ్డి. మాట్లాడుతూ నీ గురించి పదిమంది గొప్పగా చెప్పుకోవాలంటే నువ్వు 100 మంది గొప్పవాళ్ళ గురించి తెలుసుకోవాలి. సమాజంలో గౌరవమైన వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి గొప్పదైనది. సమాజంలో అన్ని రకాల వారిని





తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తి. మీరంతా బాగా చదువుకొని మంచి ఉన్నత స్థాయిలో ఉంటారని ఆశిస్తున్నానని చెప్పడం జరిగినది. తర్వాత పాఠశాల కరెస్పాండెంట్ మ్ . రామేశ్వరరావు మాట్లాడుతూ సమాజం అంటే కేవలం వ్యక్తుల సమూహం కాదు అది పరస్పర సహాయం ప్రేమ మరియు బంధాల సమ్మేళనం. సమాజంలో సేవకు ప్రాధాన్యత ఇస్తూ కులమతాలకు అతీతంగా మానవతా దృక్పథంతో ఆరోగ్యకరమైన అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించడమే మన అందరి లక్ష్యం అని చెప్పారు. తర్వాత పాఠశాల ఏవో శ్రీ ఎం.బీ.ఎన్. రాఘవేంద్రరావు మాట్లాడుతూ వ్యక్తిలో అంతర్గత శక్తులను సానబట్టి బాధ్యతాయుతమైన పౌరుడిగా తీర్చిదిద్దడమే విద్య. ప్రపంచంలో అన్ని విషయాలను అర్థం చేసుకోవడం మరియు సమాజంలో ఎలా మెలగాలను నేర్పడం విద్య యొక్క ప్రత్యేకత. సమాజంలో మనమందరం చిన్న చిన్న విషయాలకే కోప్పడకుండా పక్కవారికి సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలి ముఖ్యంగా మహిళలకు,వృద్ధులకు,చిన్న పిల్లలకు గౌరవం ఇవ్వాలి. చదువుకున్న విద్యను సమాజాభివృద్ధికి ఉపయోగించాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి సమాజ నిర్మాణానికి తోడ్పడాలి అంటూ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగినది. ఈ కార్యక్రమంలో డి. ఇ ఓ పి. జనార్ధన్ రెడ్డి ఉర్దూ డివిజనల్ ఇన్స్పెక్టర్ ఎస్. అస్మాద్దీన్. ఎస్.ఐ. సి.నాగార్జున రెడ్డి ,పాఠశాల కరస్పాండెంట్ మ్ .రామేశ్వరరావు, పాఠశాల ఏవో ఎం.బీ.ఎన్ రాఘవేంద్రరావు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, పత్రికా విలేకరులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థిని విద్యార్థుల పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఒక పండుగలా జరపడం జరిగింది

# రైల్వే సమస్యల పై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కు వినతిపత్రం సమర్పించిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు నంది పత్రిక.....** జిల్లాలో నెలకొన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు...పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో పాల్గొంటున్న ఆయన, ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి సమస్యల పై వినతి పత్రం సమర్పించారు..ఈ సందర్భంగా కర్నూలు నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నం వరకు కొత్త రైలు సర్వీసులను ప్రవేశపెట్టడం తో పాటు, విశాఖపట్నం నుంచి మహబూబ్ నగర్ వరకు ఉన్న ఎస్.ఎఫ్ రైలును కర్నూలు వరకు పొడగించాలని, ప్రమాదకర స్థితికి చేరుకుంటున్న ఆదోని పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి కి మరమ్మత్తులు చేయించాలని , లేదా కొత్త బ్రిడ్జి ని ఏర్పాటు చేయాలని, మద్దికెర వద్ద రైల్వే హాల్ట్ మరియు స్టాప్ లను నిలిపివేసిన యశ్వంత్ పూర్, అమరావతి, విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరిగి నిలిపేలా చూడాలని, అలాగే పంచాలింగాల వద్ద ఉన్న రైలు వ్యాగన్ పరిశ్రమ పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రిని ఎంపీ కోరారు... సమస్యల పై సానుకూలంగా స్పందించిన మంత్రి అశ్విని వైష్ణవ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీ నాగరాజు తెలిపారు..

# సేవాఘడ్‌లో శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘన ఏర్పాట్లు



**వెలుగోడు, ఫిబ్రవరి 11 (నంది పత్రిక):** అనంతపురం జిల్లా పరిధిలోని సేవాఘడ్ నందు ఈ నెల 14-02-2026 నుండి 15-02-2026 వరకు శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు ఈ సందర్భంగా బంజారా సంఘ నాయకులు.వెలుగోడు మండలం వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్ మరియు కె.నాగేష్ నాయక్ మాట్లాడుతూ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి , మారెమ్మ దేవతల ప్రత్యేక పూజలు , అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరగనున్నాయని పేర్కొన్నారు. దేశ నలుమూలల నుంచి బంజారా సమాజానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వేడుకలను మరింత శోభాయమానంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా బంజారా ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు బద్దె నాయక్, దేశావత్ నాగరాజు నాయక్, తాను నాయక్, మంగే నాయక్, వెంకటేష్ నాయక్, స్వామి నాయక్, శంకర్ నాయక్, నీలా నాయక్, బాలు నాయక్, సచిన్ నాయక్, రాము నాయక్, శేఖర్ నాయక్, గోపాల్ నాయక్ ఉన్నారు.

# దిగువ అహోబిలంలో కోనేరు శుభ్రత



**ఆళ్లగడ్డ ప్రతి నిధి ఫిబ్రవరి 11, నంది పత్రిక** అనంత డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని, విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛ అహోబిలం కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో కోనేరు శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామసుబ్బారెడ్డి విద్యార్థిని, విద్యార్థులకు సమాజ బాధ్యత, సేవా భావం, దేశభక్తి వంటి విలువల ప్రాముఖ్యతను వివరించి వారికి ప్రేరణ కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్వయంగా శుభ్రత కార్యక్రమంలో పాల్గొని ఆదర్శంగా నిలిచారు. అలాగే అహోబిలం దేవస్థానం సి ఎ ఒ రామానుజన్, వారి సిబ్బంది పాల్గొని తమ సహకారాన్ని అందించారు కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని, విద్యార్థుల సేవాభావం, సమాజ పట్ల వారి అంకితభావాన్ని స్థానిక ప్రజలు ప్రశంసించారు.

## బద్వేల్ హై స్కూల్విద్యార్థినులకు స్టేట్ బ్యాంక్ బద్వేలు మెయిన్ బ్రాంచ్ ఈ సైకిల్ వితరణ..!

### రాజంపేట రీసనల్ మేనేజర్ చల్ల కోటి రెడ్డి బద్వేలు చీఫ్ మేనేజర్ అన్నం రామ మూర్తి



**బద్వేల్ ఫిబ్రవరి 11 (నంది పత్రిక ):** స్టేట్ బ్యాంక్ బద్వేలు బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చదువుకునే దూర ప్రాంత విద్యార్థినులకు స్టేట్ బ్యాంక్ బద్వేలు మెయిన్ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో5 మంది విద్యార్థినులకు సైకిల్స్ ను ఉచి తంగా అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజంపేట రీసనల్ మేనేజర్ శ్రీ చల్ల కోటి రెడ్డి , బద్వేలు చీఫ్ మేనేజర్ అన్నం రామ మూర్తి, మాట్లాడుతూ బద్వేల్ స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకునేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చి విద్యను అభ్యసించే విద్యార్థులకు స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేయాలని దృఢ సంకల్పంతో బుధవారం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి బాలుర ఉన్నత పాఠశాలలోని ఐదు మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి భారతీయ స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో 5 సైకిళ్లను ఉచితంగా అందజేశామని వారు తెలిపారు. స్టేట్ బ్యాంకు వారి సహకారంతో దూర ప్రాంతాల నుంచి విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉచితంగా సైకిల్ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి స్టేట్ బ్యాంకు వారికి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ గంగా ప్రకాష్ మరియు స్టేట్ బ్యాంక్ బద్వేలు బ్రాంచ్ లోకల్ సెక్రటరీ శ్రీ సురేష్ బాబు గారు . స్కూల్ హెడ్ మాస్టర్ వెంకట సుబ్బా రెడ్డి . ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది విద్యార్థినులు తల్లిదండ్రులు హాజ రయ్యారు. తల్లిదండ్రులు సైకిలను ఉచితంగా అందజేసినందుకు కృతజ్ఞతను తెలియ చేశారు.



## నూతన పెట్రోల్ పంప్ ను ప్రారంభించిన -మాండ్ర



**పాములపాడు ఫిబ్రవరి 11 (నంది పత్రిక):**–పాములపాడు మండలంలోని, జూటూరు గ్రామ పొలిమేరలో బానకచెర్ల గ్రామానికి చెందిన రత్నమయ్య ఆహ్వానం మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్ ను నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర.శివానందరెడ్డి, మండల నాయకులతో, గ్రామ నాయకులతో కలిసి రిబ్బన్ కటింగ్ చేసి, ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డికి, టిడిపి సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి లకు నూతన పెట్రోల్ బంక్ యాజమాన్యం మరియు మండల నాయకులు, గ్రామ నాయకులు శాలువాలు కప్పి పూలమాలలు మెడలో వేసి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ & మండల కన్వీనర్ మాండ్ర.సురేంద్రనాథ్ రెడ్డి, మండల కన్వీనర్– జి.రవీంద్రారెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జి.హరిప్రసాద్ యాదవ్, సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ హరినాథ్ రెడ్డి, బండ్లమూరి.వెంకటేశ్వర రావు, భాస్కర్ రెడ్డి, హరిప్రసాద్, సొసైటీల చైర్మన్ లు జనార్ధన్ రెడ్డి, సి.గోవిందు, లక్ష్మీకాంత్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం భాషా, రుద్రవరం సురేష్, నారపరెడ్డి, జూటూరు పూసల కృష్ణ, హాఫీజ్, నాయిని మధు, నాయిని ఉపేంద్ర, నాగలక్ష్మి రెడ్డి, శివ శంకర్ స్వామి, కన్వీనర్ జి.మోహన్ రెడ్డి, క్లస్టర్ గిరిశ్వర్ రెడ్డి, రవికాంత్, మూర్తుజావలి, జాకీర్ హుసేన్, జమీల్, హెడ్ కానిస్టేబుల్ బి.వి.రమణ, మాండ్ర శివానందరెడ్డి పిఏ – మద్దిలేటి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



# "అక్రమ వెంచర్ల"పై అధికారుల చర్యలు ఏవి...?!

**అనుమతులు లేకుండా అక్రమ లే అవుట్ లు**
**ఎకరం విలువ రూ.1కోటి పైనే**
**మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ ఆదాయానికి భారీగా గండి : కౌన్సిలర్ లాల్ ప్రసాద్.**
**చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు**

**నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 11, (నంది పత్రిక):** నందికొట్కూరు పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. పంట పొలాల్లో రియల్ దందా రోజు రోజుకూ పెరిగిపోతుంది. చిన్న జాగా కనిపిస్తే చాలు మట్టి తోలటం, దానిని సైట్గా చేయడం, మాయ మాటలు చెప్పి అమ్మేయడం. ఇదే నైజంగా మారి అక్రమ రియల్టర్లు కోట్లకు పడగలెత్తుతున్నారు. నందికొట్కూరు పట్టణంతో కలిపి నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణ కొట్కూరు, బొల్లవరం, నందికొట్కూరు పట్టణం చుట్టూ కొందరు రాజకీయ నాయకులే రియల్టర్ల అవతారమెత్తి వ్యవసాయ భూములను ఎటువంటి అనుమతులు లేకుండా రాజకీయ ప్రమేయం అడ్డం పెట్టుకొని వాటిని లేఔట్లుగా మార్చేస్తు, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వ్యవసాయ భూములను వ్యాపార సంస్థల ఏర్పాటుకు, అలాగే గృహ నిర్మాణాలకు మార్పు చేయడానికి ప్రభుత్వం తరపు నుంచి పలు అనుమతులు తీసుకోవాలి. కానీ ఇక్కడ మాత్రం అవి ఏమీ కనిపించవు. కనీసం అక్కడ ఉన్న పంచాయతీ అనుమతులు కూడా కరువే. ఇంత వ్యవహారం జరుగుతున్నా సరే అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ లే అవుట్లపై ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదుదారులను, ఫిర్యాదు తీసుకున్న అధికారులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసి వారిపై అక్రమ కేసులు పెడతారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ అక్రమార్కులు వేసిన లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు భవిష్యత్తులో ఇబ్బందులు పడటమే కాకుండా వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. నందికొట్కూరు పట్టణం చుట్టూ చాలా చోట్ల అనుమతి లేని లే అవుట్లు వేసి విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో పంచాయతీలకు, మున్సి పాలిటీలకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది. పంచాయతీ అనుమతి లేకుండా, ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా రోడ్డు పక్కనే ఉన్న భూమిలో లేఅవుట్లు వేసి అమ్మడానికి సిద్ధమయ్యారు రియాల్టర్లు.మున్సిపాలిటీ,గ్రామా పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో రియల్ వ్యాపారులు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లు వేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికి ఏ అధికారి పట్టించుకోకపోవడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ నిర్మాణాల కోసం ప్రత్యేక జీవోను రూపొందించింది. జీవో నెంబర్ 145ను రియల్ ఎస్టేట్ వ్యాపారులు గాలికి వదిలేస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం లేఅవుట్ వేయాలనుకున్నవారు ఎకరాకు స్థలంలో 5 శాతం భూమిని ప్రభుత్వ గృహ నిర్మాణాల పథకానికి పేదల ఇళ్లకు కేటాయించాలి. అందులో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణా లను చేపడుతుంది. ఒకవేళ లే ఔట్ యజమాని ఆ స్థలంలో స్థలం కేటాయించడం ఇష్టం లేకపోతే సుమారు 3 కిలోమీ టర్ల దూరంలో 5 శాతం స్థలానికి ఖరీదు కట్టి దాని విలువను నగదు రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం ఆ నిబంధనలు కాని ఆ జీవో అమలు కాని శూన్యం. అంతేకాకుండా కొత్తగా లే ఔట్ వేయాలంటే ముందుగా డీటీసీపీ నుంచి అనుమతి తీసుకోవాలి. అంతకంటే ముందు వ్యవసాయ భూమిని నిర్దేశిత రుసుము చెల్లించి వ్యవసాయేతర భూమిగా మార్పిడి చేసుకోవాలి. 25శాతం మేర రోడ్లు వేసి మొక్కలు నాటాలి. కాలువలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి ఇలా అయితే గిట్టుబాటు కాదని రియల్టర్లు నిబంధనలు పాటించడం లేదు. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూముల్లో వెంచర్లు వేయ కూడదు, కానీ నందికొట్కూరు పరిసర ప్రాంతాలు చుట్టూ వెంచర్లు వేసిన దీనిని పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు కూడా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోపై దృష్టి పెట్టకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా ప్లాట్లు వేసి అమ్మకాలు జరుపుతున్నారు. అధికారులు స్పందించి అక్రమ వెంచర్లపై కొరడా జులపించి కొనుగోలుదారులు మోసపోకుండా చర్యలు చేపట్టాలని పట్టణ, గ్రామాల ప్రజలు కోరుతున్నారు..

**వెంచర్లుగా మారుతున్న పంట పొలాలు :** నందికొట్కూరు పట్టణం, గ్రామాల్లో అంచలంచెలుగా అభివృద్ధి ఎదుగుతుండడంతో ఇక్కడి భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. దీంతో కొందరు వ్యక్తులు చోటామోటా లీడర్లు, ముఖ్య నేతలు అనుచరులు, ప్రజా ప్రతినిధుల అండతో సంబంధిత శాఖల నుంచి అనుమ తులు తీసుకోకుండా, ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేస్తున్నారు. పట్టణంలో ప్రధానంగా నాగలూటీ రోడ్డు, మిడుతురు రోడ్డు, ఆత్మకూరు రోడ్డు, పగిడ్యాల రోడ్డుతో పాటుగా గ్రామాల్లో కూడా



విచ్చలవిడిగా అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. అధికారులు స్పందించి అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని నందికొట్కూరు ప్రజలు కోరుతున్నారు.

**మున్సిపాలిటీ ఆదాయానికి గండి : లాలూ రవిశంకర్ వరప్రసాద్, 12 వ వార్డు కౌన్సిలర్, నందికొట్కూరు**

నందికొట్కూరు లో 12వ వార్డు పరిధిలో అక్రమంగా వెంచర్లు వెలిశాయి. ఈ వెంచర్ల లో అమాయక ప్రజలు ప్లాటులు కొంటె పాట్లు పడక తప్పదు. ప్రభుత్వం నిబంధనలు ఉన్న వెంచర్లు లో ప్లాటులు కొంటె ప్రజలకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వానికి ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వం రోడ్లు, డ్రైనేజి కాలువలు, నీటి వసతి వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది. దయచేసి ప్రజలు అనుమతులు లేని లే అవుట్లలో స్థలాలు కొనొద్దని కోరుతున్నాం. అలాగే అనుమతులు లేని వెంచర్లపై ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని కోరుతున్నామన్నారు.



## జిల్లాలోని పెట్రోల్ బంక్ యజమానులు ప్రభుత్వ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలి.

### జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.




**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11 నంది పత్రిక** భీమవరం మండలం, యనమదుర్రు గ్రామంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ ను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేసినారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇంధన నాణ్యత, కొలతలు సరిగ్గా ఉండడం, ధరల ప్రదర్శన, భద్రతా ప్రమాణాలు, వినియోగదారుల సేవలపై ప్రత్యేకంగా పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యమైన ఇంధనం, సరైన సేవలు అందించాలన్నారు. పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రజలు ఇంధనం తీసుకునే సమయంలో బిల్లు తీసుకోవాలని, ఏవైనా అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ వినియోగదారులకు సూచించారు. పెట్రోల్ బంకు నుండి వృదా నీరు రోడ్డు పైకి రావడం గమనించి, నేరుగా భూగర్భంలోకి వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని బంకు యాజమాన్యాన్ని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంలో ఏఎస్ఓ శివశంకర్, తహసిల్దార్ రావి రాంబాబు, వీఆర్వో తదితరులు ఉన్నారు.

## శ్రీశైలం నడకదారిలో పెద్దపులి కలకలం... ఊపిరిబిగపట్టిన భక్తులు!

శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు భయంకరమైన అనుభవం ఎదురైంది. నల్లమల అటవీ మార్గంలో వారికి ఏకంగా ఓ పెద్దపులి ఎదురుపడింది. మార్కాపురం జిల్లా డోర్నాల మండలం పరిధిలోని పెద్దచెరువు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, శివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన వెళుతున్న భక్తుల బృందానికి దారి పక్కన పొదల్లో పెద్దపులి కనిపించింది. కొద్దిసేపు భక్తులను తీక్షణంగా చూస్తూ అక్కడే నిలబడింది. అటవీశాఖ అధికారుల హెచ్చరికలతో అప్రమత్తంగా ఉన్న భక్తులు, భయంతో పరుగులు తీయకుండా నిల్చుండిపోయారు. ఇరువైపులా నిశ్శబ్దం నెలకొనగా, క్షణక్షణం ఉత్కంఠగా గడిచింది. కొంతసేపటికి ఆ పులి నెమ్మదిగా అడవిలోకి వెళ్లిపోవడంతో భక్తులంతా ఊపిరి పీల్చుకున్నారు. 'శ్రీశైలం మల్లన్నే కాపాడాడు', 'ఓం నమశ్శివాయ' అంటూ భక్తితో నినాదాలు చేస్తూ తమ యాత్రను కొనసాగించారు. ఈ ఘటనను ఓ వాహనదారుడు తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు.

## నగల దుకాణం చోరీ కేసులో నిందితుల అరెస్టు

### చోరీ సొమ్ము రికవరీ చేసిన పోలీసులు
### నిందితులంతా తెలంగాణవాసులు
### గంటల వ్యవధిలోనే కేసును చేదించిన పోలీసులను అభినందించిన డి.ఎస్.పి

**బనగానపల్లె ఫిబ్రవరి 11 నంది పత్రిక** బనగానపల్లె పట్టణంలోని పీర్ల చావిడి వద్ద ఉన్న శ్రీనివాస్ జువెలరీ అనే నగల దుకాణంలో ఈ నెల 7వ తేదీన జరిగిన చోరీ కేసులో పోలీసులు బుధవారం ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. సంఘటన జరిగిన రోజు షాపు యజమాని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసును నమోదు చేసుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే కేసును చేదించి నిందితులను పట్టుకుని బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో డిఎస్పి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన పట్టణంలోని శ్రీనివాస జువెలరీ నగల దుకాణంలో జరిగిన చోరీ కేసులో ఆరుగురు నిందితులను బుధవారం సాయంత్రం పాణ్యం వద్ద మూతపడిన స్టీల్ ఫ్యాక్టరీ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులంతా మైలార్ దేవరపల్లి రాజేంద్రనగర్ రంగారెడ్డి జిల్లాకు చెందిన వారని వారి పేర్లు వెల్లడిస్తూ మహమ్మద్ ఇమ్రాన్, షేక్ మహమ్మద్ ఇబ్రహీం సయ్యద్ సదుల్లా మహమ్మద్ ఇబ్రహీం మహమ్మద్ షేక్షావలి అలియాస్ బాతు బాలాజీ అను వీరిలో ఏ 1నిందితుడైన ఇమ్రాన్ గతంలో వెల్డింగ్ షాప్ లో పనిచేసేవాడని దీంతో షాపు యొక్క లాకర్ ను ను ఏ విధంగా గ్యాస్ కట్టర్ తో కట్ చేయవచ్చుననేది బాగా తెలిసిన వాడని దొంగతనం జరిగిన రోజు వారు తెచ్చుకున్న కట్టరు గ్యాస్ సిలిండర్ తో షాప్ యొక్క లాకర్ను కట్ చేశారని దాంతో దుకాణాన్ని ఓపెన్ చేసి దుకాణంలో నగలు చోరీ చేసి తాము వచ్చిన బొలెరో వాహనంలో తిరిగి వెళ్లిపోయారని తెలిపారు. అయితే సాంకేతిక అంశాలతో ఈ కేసును చేదించినట్లు తెలిపారు.కేసు లో నిందితులతో పాటు వారి వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

**గంటల వ్యవధిలో కేసును చేదించిన పోలీసులకు డిఎస్పి అభినందనలు** నగల దుకాణంలో జరిగిన చోరీపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మా పోలీసులు గంటల వ్యవధిలోని కేసును చేదించారని క్రైమ్ బ్రాంచ్ ఎస్సై సురేష్,సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు దుగ్గిరెడ్డి కల్పన కేసును చేదించి నిందితుల కోసం గాలింపు చేపట్టారని ఎట్టకేలకు నిందితులను ఈరోజు అరెస్టు చేశారని నిందితులు దుకాణంలో చోరీ చేసిన 18 తులాల బంగారు నగలు 8 కేజీల వెండిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ కేసు ను నాలుగు రోజుల వ్యవధిలోనే చేదించిన పోలీసులను అభినందిస్తున్నట్టు డిఎస్పి మీడియా సమావేశంలో తెలిపారు . మీరందరికి రివార్డు వచ్చే విధంగా జిల్లా ఎస్పీకి రివార్డు కోసం నివేదిక అందజేస్తామని తెలిపారు.



నంది పత్రిక
గురువారం 12 - 02 -2026

## మ్యుటేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి..

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11 నంది పత్రిక నరసాపురం ఆర్డీవో కార్యాలయంను బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించి కొన్ని భూమి, స్థిరాస్తిలకు సంబంధించి యజమాన్యంలో మార్పులను ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మ్యుటేషన్ ప్రక్రియను వివాదాలకు తావు లేకుండా పక్కగా నిర్వహించాలన్నారు. మ్యుటేషన్ అనేది భూమి యజమాన్యంలో మార్పు వచ్చినప్పుడు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసే ముఖ్యమైన ప్రక్రియ అన్నారు. ఇది చట్టబద్ధ హక్కుకు ప్రత్యామ్నాయం కాకపోయినా, పరిపాలనా పరంగా చాలా అవసరం అన్నారు. భూమి కొనుగోలు చేయడం, వారసత్వం రావడం జరిగిన వెంటనే మ్యుటేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ఒక భూమి లేదా ఆస్తి యజమాని మారినప్పుడు, ఆ మార్పును గ్రామ, మండల రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేయించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో కొత్త యజమాని పేరు నమోదు కావడం వల్ల పన్నులు చెల్లించడం, పాసుబుక్లు పొందడం వంటివాటికి సులువుగా ఉంటుందన్నారు. మ్యుటేషన్ ప్రక్రియకి సంబంధిత మండల రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని లేదా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ డీడ్ కాపీ, పాత పట్టాదారు పాసుబుక్ ఆధార్, గుర్తింపు పత్రాలు, వారసత్వ ధృవపత్రం సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు ఉన్నారు.

## పెద్దమైనవాని లంక సముద్రం ఒడ్డున నిర్మిస్తున్న అడ్డుకట్టను పరిశీలించిన :జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



నరసాపురం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11 నంది పత్రిక నరసాపురం మండలం పెద్దమైనవాని లంక వద్ద నిర్మాణంలో ఉన్న సముద్రపు కోత నిరోధక అడ్డుకట్ట నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు ఎప్పటికీ పూర్తవుతాయి, ఇంకా ఏమి పనులు చేపట్టాలి, తదితరు వివరాలను డిలైట్ కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మీ గ్రామ ప్రజల కోసం చేస్తున్న ఎంత గొప్ప మేలు అని, ప్రజలందరూ సహకరించాలన్నారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టి తీసుకురావాలని డిలైట్ ప్రతినిధులకు సూచించారు. అనంతరం రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ సహకారంతో మొంథా తుఫాన్ పునరావసర పథకం కింద మత్స్యకారులకు అందజేయడానికి సిద్ధం చేస్తున్న బోట్లు నిర్మాణ పనులను, వలలను స్వయంగా పరిశీలించి నిర్మాణ ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. పూర్తిస్థాయిలో బోట్లు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి తెలియజేస్తే, లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. బోట్లు వినియోగానికి లబ్ధిదారుల పేరున లైసెన్స్ పొందడానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని మత్స్య శాఖ ఎఫ్డిఓ ను ఆదేశించారు. రామకృష్ణ మిషన్ సహకారంతో మొంథా తుఫాన్ పునరావసర పథకం కింద వందమంది మత్స్యకారులకు ఒక్కొక్కరికీ రూ.50 వేలు విలువ కలిగిన పడవ, రూ.20 వేలు విలువ కలిగిన వలను రూ.70 లక్షల వ్యయంతో అందజేయనున్నారు. చివరిగా పడవలు ప్రారంభానికి అనువైన సముద్ర బ్యాక్ వాటర్ చానల్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు మైల వసంతరావు, మత్స్య శాఖ ఎఫ్డిఓ ఏ.దుర్గ ఏడుకొండలు, తహసిల్దార్ ఐవివి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.



## నరసాపురంలో డంపింగ్ యార్డ్, గురుకులం ఏర్పాటుకు స్థలాల పరిశీలన

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

నరసాపురం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11 నంది పత్రిక నరసాపురం పట్టణంలో డంపింగ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి విస్తృతంగా పర్యటించి పలు అనువైన ప్రాంతాలను పరిశీలించారు. పట్టణంలో చెత్త నిర్వహణ సరైనవిధంగా లేకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డంపింగ్ సమస్య ఒక్క అధికారులదే కాకుండా ప్రతి పౌరుడి సమస్య అని పేర్కొన్నారు. పరిశుభ్రత లేకపోతే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు గ్రహించాలని సూచించారు. టన్నులు కొద్ది చెత్తను ప్రతిరోజు ఉత్పత్తి చేయడమేకాదని, దాన్ని సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించడంలో కూడా ప్రజలు సహకరించాలని తెలిపారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని గుర్తించడంలో స్థానిక ప్రజలు సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని కోరారు. అలాగే నరసాపురంలో గురుకుల విద్యాసంస్థ ఏర్పాటుకు కూడా స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే విధంగా అనువైన స్థలాన్ని ఎంపిక చేసి, త్వరలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు. జిల్లా యంత్రాంగం ప్రజల సహకారంతో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనిచేస్తుందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత మరియు విద్యా సదుపాయాల విస్తరణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంలో ఆర్డిఓ దాసిరాజు, తహసిల్దార్ ఐవివి సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



# జిల్లాలో మహా శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు..

**సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి..**
**పారిశుధ్యం, మెడికల్ క్యాంపులు పక్కాగా నిర్వహించాలి**
**ప్రత్యేక దర్శనాలతో సామాన్య భక్తులకు ఇబ్బంది కలకూడదు..**
**దివ్యాంగుల దర్శనాలకు ప్రాధాన్యత నివ్వాలి**
**శైవ క్షేత్రాలు వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలి..**
**మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై ..జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం: చీప్ బ్యూరో ఫిబ్రవరి 11 నంది పత్రిక,. జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో మహా శివరాత్రి సందర్భంగా సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ ఎటువంటి అసౌకర్యం లేకుండా చక్కని దర్శనం కలిగేలా మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఈ నెల 15న మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 13 నుండి 18 వరకు భీమవరం సోమేశ్వర స్వామి, పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ప్రసిద్ధ శైవ క్షేత్రాలతోపాటు, మిగిలిన ప్రాంతాల్లో కూడా మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలసి బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాలైన రెండు ప్రముఖ పంచారామ క్షేత్రాలు భీమవరం సోమేశ్వర స్వామి, పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి దేవాలయాలకు లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరు అవుతారని వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. గత సంవత్సరాల వేడుకల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి సంఘటనలకు ఆస్కారం లేనివిధంగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూ లైన్లు, త్రాగునీటి సరఫరా, చిన్నారులకు పాలు, పెద్దవారికి అల్పాహారం, దర్శనం చేసుకున్న ప్రతిభక్తునికి ఉచిత ప్రసాదం పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మంచినీటి నాణ్యతను పరీక్షించి సరఫరా చేయాలన్నారు. శ్రీశైలం సంఘటన, పొరుగు జిల్లాలో గత సంవత్సరం సంఘటనలను దృష్టిలో ఉంచుకొని గోదావరి, సముద్ర స్థానాలకు వెళ్ళే భక్తులకు జాగ్రత్తలు తెలియజేసేలా టాశీ.. టాశీ.. వేయించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. రెండు శైవ క్షేత్రాలలో ప్రాధమిక వైద్యసేవలు అందించేందుకు వైద్యులను, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. 108 వాహనాలు కుడా అందుబాటులో ఉంచాలని సూచించారు. రెండు పంచారామాలతో పాటు, నత్తా రామేశ్వరం, మావుళ్ళమ్మ దేవస్థానాలు వద్ద క్యూ లైన్లు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. విఐపి, ప్రోటోకాల్ దర్శనాలను క్రమబద్ధీకరిస్తూ సామాన్య భక్తులకు, దివ్యాంగులకు అత్యధిక ప్రాధ్యాన్యత ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. రథయాత్రలు, తెప్పోత్సవాలు నిర్వహణకు ముందస్తుగా ఆర్ అండ్ బి అధికారులకు తెలియజేసి, సర్టిఫికెట్ పొందాలన్నారు. భక్తులకు ప్రసాద వితరణ కచ్చితంగా చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన పీఏ సిస్టం ఏర్పాట్లను కుడా చేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో మహా శివరాత్రి సందర్భంగా సుమారు 3 వేల నుండి 10 వేల వరకు భక్తులు వచ్చే దేవాలయాలను గుర్తించి రెవెన్యూ, పోలీసు, దేవాదాయ శాఖలు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. ఎక్కడ



కుడా భక్తులకు అసౌకర్యాలు కలగుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పగడ్బంధిగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఫిబ్రవరి 14, 15 తేదీలలో అధిక సంఖ్యలో భక్తుల రద్దీ ఉంటుందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా ప్రస్తుతం ఉన్న సిసి కెమెరాలకు అదనంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల రద్దీ, ఏర్పాట్లు, తదితర అంశాలను అంచనా వేసేందుకు రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందితో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. క్యూ లైన్ల క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక ఏర్పాట్లలో భాగంగా డ్రోన్లను వినియోగించాలన్నారు. శివరాత్రి సందర్భంగా ఎటువంటి వాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ద్వారా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, ఆర్డీవోలు, డిఎస్పిలు, రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, వైద్య, ఫైర్, విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రెండు సంవత్సరాలుగా పరిష్కారం కానీ చిన్న మామిడిపల్లి, దర్శిపర్రు గ్రామాల రైతుల భూముల రిజిస్ట్రేషన్లకు విముక్తి...







**ఆయా గ్రామాల రైతులలో వెల్లివిరిసిన ఆనందం**
**వెబ్ ల్యాండ్ లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించి, పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి...**

నరసాపురం: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11, నంది పత్రిక

నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించి నరసాపురం మండలం చిన్న మామిడిపల్లి, పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామాలలో రైతుల భూముల పెండింగ్ రిజిస్ట్రేషన్ల పరిష్కారానికి నేడు వెబ్ ల్యాండ్ లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించి, పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. నరసాపురం మండలం చిన్న మామిడిపల్లి, పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామాలలోని కొంత ప్రాంతం నరసాపురం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలలో

కలవడంతో ఆయా గ్రామాలలో నిర్వహించిన రిసర్వే లో ఆ ప్రాంతాలకు ఎల్పీఎంలు విడుదల కాకపోవడం, గత రెండు సంవత్సరాలుగా రైతుల భూములకు రిజిస్ట్రేషన్లు జరగక పడుతున్న ఇబ్బందులు నేటితో తొలగిపోయాయి. ఈ రెండు గ్రామాల రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ప్రభుత్వంతో పలు దఫాలుగా చర్చించిన మీదట వెబ్ ల్యాండ్ లో 2.0 గ్రామాలుగా క్రియేట్ చేసి ఎల్పీఎంలు కాకుండా సర్వే నెంబర్లు జారీ ద్వారా నేటి నుండి రిజిస్ట్రేషన్ ల పక్రియకు మార్గం ఏర్పాటు చేయడం జరిగింది. గత రెండు సంవత్సరాలగా రైతులు తమ భూములను అవసరాలకు అమ్మడానికి, వారసులు పేరున రిజిస్ట్రేషన్ చేయడానికి ఆటంకంగా ఉండేది. రెండు గ్రామాల్లో సుమారు 1,700 ఎకరాలలోని 2 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనున్నది.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ ఎన్.నిరంజన్ కుమార్, తహసిల్దార్ ఐతం సత్యనారాయణ, పాల్గొన్నారు. ..

# రైతులు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రుణాలు పొందాలంటే ఈ పంట నమోదు తప్పనిసరి...



### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11 నంది పత్రిక నరసాపురం మండలం ఎల్.బి చర్ల భైరవపాలెంలో రైతులు కూనపురెడ్డి మల్లిఖార్జునరావు, బర్రి ముసలయ్య ఈ-క్రాప్ బుకింగ్ ను బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంలో రైతుతో మాట్లాడుతూ ఏ వెరైటీ వేశారు, విస్తీర్ణం ఎంత, పంట రుణం ఏమైనా తీసుకున్నారా, ఎప్పటికీ కోతలకు వస్తుంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ పంట నమోదు రైతుతో కలిసి వారి పొలం దగ్గరకు వచ్చి ఈ క్రాప్ బుకింగ్ చేసేవారని, ఇప్పుడు ఈ విధానాన్ని ప్రభుత్వం సరళతరం చేస్తూ రైతే స్వయంగా ఈ పంట నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. దీనికోసం ప్రభుత్వం ఏపీ ఏ ఐ ఎం ఎస్ యాప్ (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం) ను రూపొందించి అమల్లోకి తీసుకువచ్చింది అన్నారు. ఇప్పుడు రైతు ఈ పంట ప్రక్రియను స్వయంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల రైతులకు అనేక ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రుణాలు సులభంగా అందుతాయని తెలిపారు. పంటల డేటాను డిజిటల్‌గా రికార్డ్ చేసి పరిహారాలు, బీమా వంటివి వేగంగా అందించడానికి సహాయపడుతుందన్నారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు, సున్నా వడ్డీ పథకాలు సులభంగా పొందవచ్చు అన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వంటి పంట బీమాలో ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటే చేరవచ్చు అని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్రాలపై సబ్సిడీలు, రాయితీలు లభిస్తాయి అన్నారు. వర్షాలు, తుఫానులు, కరువు వంటి సందర్భాల్లో పంట నష్టానికి త్వరగా పరిహారం వస్తుంది, ఈ పంట డేటా ఆధారంగా లెక్కింపు సులభం అవుతుందన్నారు. పి యం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాల లబ్ధి పొందడానికి ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అని, అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్మకం చేయడానికి వీలవుతుంది అన్నారు. ప్రతి ఒక్క రైతు ఈ పంట నమోదును తప్పకుండా పూర్తి చేసుకోవాలి జిల్లా కలెక్టర్ తెలిపారు. తొలుత దర్భరేపు వెస్ట్ పూడిక తీత పనులపై స్థానిక రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. షట్టర్లు ఏర్పాటు, 8.3 కిలోమీటర్ల పొడవునా వెస్ట్ దబ్బరేవులో పూడికతీత పనులు చేపట్టడం వలన సుమారు తొమ్మిది పంచాయతీల్లోని రైతులు రెండు పంటలు పండించుకునే అవకాశం కలుగుతుందని కలెక్టర్ కు విన్నవించడం జరిగింది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ అధికారులతో ప్రతిపాదనలను తయారు చేయించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఆర్డీవో దాస్ రాజు, ఏడీఏ ఎంవీఎస్ ప్రసాద్, ఎంఏఓ జోష్ల, విఏఎ నాగజ్యోతి, డెల్టా కమిటీ చైర్మన్ గుబ్బల మర్రి రాజు, తహాసిల్దార్ ఐ వి వి సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.అసుర రెడ్డి, ఈవోపీఆర్డి కె.నాగేంద్ర కుమార్, రైతులు పాల్గొన్నారు....





# సిఎఏ రిజిస్ట్రేషన్లకు ఎన్ఓసి సంబంధిత ఆర్డీవో కార్యాలయాల ద్వారానే పొందాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11 నంది పత్రిక** సిఎ ఏ ( కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ) రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా అవసరమైన (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ )సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాల ద్వారా మాత్రమే పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. సిఎఏ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఇనామ్, జమీందారి భూములు అలాగే మొగల్తూరు మండలం, నర్సాపురం , యలమంచిలి, భీమవరం మండలాల్లో వెబ్ ల్యాండ్ లో డేటా లేని రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలను మత్స్యశాఖ అధికారులు సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు. ఆ వివరాల ఆధారంగా సంబంధిత ఆర్డీవో కార్యాలయాల ద్వారా ఎన్ఓసి పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్ఓసి పొందేందుకు ఎవరూ వీఆర్వోలను సంప్రదించవలసిన అవసరం లేదని, ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత ఆర్డీవో కార్యాలయం లేదా మత్స్యశాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. అలాగే వెబ్‌ల్యాండ్‌లో డేటా నమోదైన ఆక్వా రైతుల అప్సడా( ఏపీ ఎస్ డి ఏ–) రిజిస్ట్రేషన్లను రెవెన్యూ శాఖతో సంబంధం లేకుండా మత్స్యశాఖ అధికారులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రక్రియలో ఆలస్యం లేకుండా రైతులకు సౌలభ్యం కల్పించేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని పేర్కొన్నారు. సిఎఏ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు.

# అప్సడ రిజిస్ట్రేషన్‌లో అవినీతి ఆరోపణలు వస్తే కఠిన చర్యలు

## పట్టాదార్ పాస్ పుస్తకాల ముద్రణలో తప్పులకు తావు లేకుండా చూడాలి

## జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11 నంది పత్రిక** అప్సడ( ఏపీ ఎస్ డి ఏ) రిజిస్ట్రేషనల ప్రక్రియలో రైతులను ఇబ్బందులకు గురిచేసిన లేదా అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ నుండి బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్డీవోలు, మత్స్య శాఖ అధికారులు, తహసిల్దార్లు, మండల సర్వేయర్లతో గూగుల్ మీట్ ద్వారా అప్సడ రిజిస్ట్రేషన్లు, నూతన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అప్సడ రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే రైతులను అవసరం లేకుండా విఆర్వోను కలవాలని సూచించకూడదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే రైతులు నేరుగా తహసిల్దార్లను కలిసి పరిష్కారం పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెబ్ ల్యాండ్ లో భూమి వివరాలు సమగ్రంగా నమోదై ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆలస్యం చేయకుండా సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. మార్చి నెలలో నూతన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో అధికారులు లక్ష్యసాధనకు కట్టుబడి పనిచేయాలని పేర్కొన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల ముద్రణలో చిన్న తప్పు కూడా దొర్లకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. రైతుల నుండి వివిధ సమస్యలపై అందుతున్న దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియపై సంబంధిత ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి పనులు సమయానికి పూర్తయ్యేలా చూడాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ గూగుల్ మీట్ సమావేశంలో డిఆర్ఓ బి.నారాయణరెడ్డి, ఆర్డీవో కె.రామచంద్రారెడ్డి, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ సురేష్, జిల్లాలోని తహసిల్దార్లు, ఎఫ్‌డిఓలు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ ప్లాన్ రోడ్డు పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య.



**తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11 నంది పత్రిక** బాలాజీ కాలనీ – చెర్లోపల్లి రోడ్డు నుండి ఎస్వి యూనివర్సిటీ పక్కగా జూపార్కు రోడ్డులోకి వెళ్లేలా ఏర్పాటు చేయనున్న మాస్టర్ ప్లాన్ రోడ్డును నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. బుధవారం సాయంత్రం మునిసిపల్, తుడా, ఎస్వీయు అధికారులతో కలసి ఈ మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించారు. ఎస్వీయు మీదుగా వెళ్లేలా రూపంచిన మాస్టర్ ప్లాన్ రోడ్ల వలన విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉండనుండడంతో ప్రత్యామ్నాయంగా రోడ్డు ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేశామని కమిషనర్ తెలిపారు. ముఖ్యంగా ప్రజలకు, విద్యార్థులకు ఎవరికీ ఇబ్బంది లేకుండా బాలాజీ కాలనీ – చెర్లోపల్లి రోడ్డు ఫ్లైఓవర్ నుండి ఎస్వీయు, ఎన్ సి సి నగర్ పక్కగా అలిపిరి కి చేరే విధంగా రోడ్డు ఏర్పాటు చేసేలా ప్లాన్ సిద్ధం చేయనున్నామని తెలిపారు. కమిషనర్ వెంట ఎస్వీయు వి.సి.నరసింహ రావు, రిజిస్ట్రార్ భూపతి, నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, డి.ఈ.రమణ, డిసిపి ఖాన్, తుడా సీపీఓ దేవి కుమారి, ఏసీపి పార్వతి ప్రియ, సర్వేయర్ కోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



# గోదావరిపుష్కరాలు -2027 ఇప్పటి నుండే తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చెయ్యాలి.

**స్నాన ఘట్టాలు అందుకు అనుగుణంగా మిగతా ఏర్పాట్లపై నివేదికలు సిద్ధం చెయ్యాలి.**

**గోదావరిపుష్కరాలు -2027 సమీక్ష సమావేశంలో వివిధ శాఖలు జిల్లా అధికార్లకు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి దిశానిర్దేశం ...**



**ఏలూరు/పోలవరం, చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 11: నంది పత్రిక** పోలవరం మండలం పట్టిసీమ టూరిజం రివర్ ఇన్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన గోదావరి పుష్కరాలు –2027 సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. శాఖలు వారీగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు–2027 ఏర్పాట్లుపై ఇప్పటికే రెండు పర్యాయములు సమావేశాలు నిర్వహించు కున్నామని అన్నారు. గోదావరి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుండే అన్నిశాఖలు అధికారులు ముందస్తు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ముఖ్యంగా స్నానఘట్టాలను గుర్తించడం, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, వైద్యశిబిరాలు, భద్రత, జనసమూహ నిర్వహణ, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవలు సమన్వయం చేయడం వంటి అంశాలుపై వివరణాత్మక నివేదికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. గతంలో ఉన్న స్నానఘట్టాలు ఈ సారి స్నానఘట్టాలు ఏమైనా పెరిగినాయా, పెంచవలసిన అవసరం ఉందా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రస్తుత స్థానఘట్టాలకు రిపేర్లు ఉన్నచో వాటి పూర్తిస్థాయి అంచనాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేదుకు తగిన ఏర్పాట్లు, పిండప్రదానాలు, దర్శనాలు అనంతరం దగ్గరలో ఏఏ ప్రముఖ దేవాలయాలు వెళ్తారు వివరాలను సిద్ధం చెయ్యాలని అన్నారు.

ఈ సమావేశంలో ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఆర్డీవో యం.వి.రమణ, ఐటిడిఏ పివో కె.రాములు నాయక్, డిఎస్పీ యం.వెంకటేశ్వర రావు, దేవస్థానం పొందరు వంశస్థులు రాజా కొచ్చర్లకోట వీరభద్రరావు, దేవస్థానం ఇవో సి.హెచ్.వెంకటలక్ష్మి, జిల్లా, డివిజన్, మండల వివిధ శాఖలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమసమాజ స్థాపనలో భాగస్వాములవ్వాలి..

## లూర్ధుమాతను అందరూ ఆదర్శంగా తీసుకోవాలి..

## కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వాన్నేస్



**కర్నూలు నంది పత్రిక......** సమసమాజ స్థాపనలో అందరూ భాగస్వాములవ్వాలని, లూర్ధుమాతను (మేరిమాతను) ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని జీవిత పయనంలో ముందుకు సాగాలని కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వాన్నేస్ పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల చెక్ పోస్ట్ లోని పరిశుద్ధ లూర్ధుమాత కథిడ్రల్ లో(బిషప్ చర్చి) లూర్ధుమాత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వాన్నేస్ ప్రధానార్చకులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దైవ సందేశమందిస్తూ 1858వ సంవత్సరం ఫిబ్రవరి 11వ తేదీన ఫ్రాన్స్ దేశంలోని లూర్ధు అనే నగరంలో మేరిమాత బెర్నదెత్ అనే నిరక్ష్యరాస్య బాలికకు దర్శనమై ప్రార్ధన, ప్రాయశ్చిత్తం, హృదయ పరివర్తన చెందమని ప్రపంచానికి బోధించిందని తెలిపారు. ప్రపంచశాంతి కోసం ప్రార్ధించుమని కోరిందని గుర్తు చేశారు. నేటి ప్రపంచ పరిస్థితులు చూస్తుంటే ప్రపంచ దేశాలు అశాంతితో రగిలిపోతూ, మూడో ప్రపంచ యుద్ధానికి కాలుదువ్వుతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. ఇలాంటి సంకట పరిస్థితుల్లో ప్రపంచ దేశాల పాలకుల్లో మార్పు రావాలని, ప్రపంచ దేశాల్లో శాంతిసుమాలు వెల్లివిరిసేలా చేయుమని దేవున్ని వేడుకోవాలని కోరారు. సమసమాజ స్థాపనలో, నవ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహోత్సవానికి ముందు లూర్ధుమాత స్వరూపంతో సీ.క్యాంప్ సెంటర్ నుంచి, నంద్యాల చెక్ పోస్ట్ మీదుగా బిషప్ చర్చి వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ కె. ప్రతాప్ రెడ్డి, అసిస్టెంట్ ఫాదర్ రాజశేఖర్, డయాసిస్ వ్యాప్తంగా ఉన్న ఫాదర్లు, సిస్టర్లు, విశ్వాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



# కేసీ నీటిని వినియోగించుకోవాలి: సీఈ

కేసీ ఆయ కట్టు రైతులు హంద్రీనీవా నుంచి, ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి కేసీకెనాల్‌కు విడుదల చేస్తున్న నీటిని సద్వినియోగించుకోవాలని హంద్రీనీవా సీఈ కబీర్, ఎస్ఈలు పాండురంగయ్య, బాల చంద్రారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని మల్యాలవద్ద గల హంద్రీ నీవా ఎత్తిపోతలను, అలాగే ముచ్చు మర్రి ఎత్తిపోతలను, కేసీ కెనాల్‌కు నీటి విడుదలను సీఈ కబీర్, ఎస్ఈ బాలచంద్రారెడి, పాండురంగయ్య పరిశీలించారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నీటిమట్టాన్ని పరిశీలించారు. అలాగే కేసీ కెనాల్ కట్ట పటిష్టతను కూడా పరిశీలించారు. సుంకేసుల నుండి 120 కిలోమీటర్ల దాకా కేసీ కెనాల్ కట్టను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నీటిని సకాలం లో విడుదల చేశాం కాబట్టి సద్వినియోగం చేసుకోవాలని, వృథా చేయ కూడదని అన్నారు. పంట కోతలు పూర్తయ్యే వరకు నీరివ్వాలని కోరా రు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రసాద్ ఇంజనీర్లు సిబ్బంది పాల్గొన్నారు.



# మహాశివరాత్రి వేడుకలకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఇంచార్జ్ రితేష్ రెడ్డికి ఆహ్వానం



**బద్వేల్, ఫిబ్రవరి 11 (నంది పత్రిక):** బద్వేల్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లంకమల్లేశ్వర రామలింగేశ్వర స్వామి వారి మహాశివరాత్రి వేడుకల ఆహ్వాన పత్రికను 11/2/26 న బద్వేల్ మాజీ శాసన సభ్యురాలు విజయమ్మ , బద్వేల్ ఇంచార్జ్ శ్రీ రితిష్ కుమార్ రెడ్డి కి ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ బీరం చంద్రశేఖర్ రెడ్డి , బద్వేల్ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బిజీవేముల రామచంద్రారెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు కలిసి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ని, ఇంచార్జ్ రితేష్ రెడ్డి ని స్వయంగా కలిసి మహాశివరాత్రి వేడుకలకు హాజరుకావాల్సిందిగా ప్రేమపూర్వకంగా ఆహ్వానించారు. వచ్చే ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం నాడు స్వామి వారి కళ్యాణోత్సవం మరియు ఇతర విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. ఈ కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# శివరాత్రి యాత్రికుల కోసం పటిష్ట ఏర్పాట్లు.



**వెలుగోడు, ఫిబ్రవరి 11 (నంది పత్రిక):** శివరాత్రి సందర్భంగా శ్రీశైలం ఆలయానికి టైగర్ రిజర్వ్ గుండ కాలినడకన వెళ్లే యాత్రికుల కోసం నంద్యాల శ్రీశైలం టైగర్ రిజర్వ్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ & ఫీల్డ్ డైరెక్టర్ బి. విజయ కుమార్ పరిశీలించారు.యాత్రికుల సౌకర్యార్థం రిజర్వ్‌లో 7 ప్రాంతాలలో సదుపాయలు, 5 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా, భక్తులకు ప్రథమ చికిత్సతో పాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నామని. భద్రత కోసం సుమారు 400 మంది సిబ్బందిని మూడు షిఫ్టులుగా అందుబాటులో ఉన్నారని తెలుపుతూ.సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నియంత్రించి, ఆహార కేంద్రాల్లో స్టీల్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని తప్పనిసరి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం స్ట్రెచర్లతో ప్రత్యేక సిబ్బంది సిద్ధంగా ఉంచారు. 24 గంటల కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుండగా, అకస్మాత్తు మంటలను నివారించేందుకు డ్రోన్లను కూడా వినియోగిస్తున్నామని చెబుతూ.యాత్రికులు ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్.



**కేసముద్రం, ఫిబ్రవరి 11(నంది పత్రిక):** సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేసముద్రం స్టేషన్ కు చెందిన మారగాని శ్రీనివాస్ ప్రస్తుతం సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నూతనంగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీకి సైతం ఎన్నికలు నిర్వహించగా సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ కేసముద్రం స్టేషన్ లోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోని 24వ పోలింగ్ బూత్ లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్ ను సత్కరించిన అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్. సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ కు తన స్నేహితుడు రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్ కేసముద్రంలో కలువగా ఆయనను స్వాగతించి, పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, కేసముద్రం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ జి.వివేక్, హైకోర్టు న్యాయవాది మారగాని కృష్ణ, నాగనబోయిన సునితా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్





**మహబూబాబాద్, ఫిబ్రవరి 11(నంది పత్రిక):**బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మహబూబాబాద్ పట్టణం గుమ్మడూరు 13వ వార్డు మండల ప్రజా పరిషత్ పాఠశాలలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణం లోని ప్రభుత్వ హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన 19వ వార్డు పోలింగ్ కేంద్రంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుండి ప్రారంభమైన పోలింగ్లో ఉత్సాహంగా అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబ సభ్యులు, మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతీ, యువకులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్, వ్యయ పరిశీలకులు జి. శ్రీనివాస్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలిస్తూ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఓటు హక్కు వినియోగించుకొని ఓటర్లకు సమాచారం అందించి ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అవగాహన ప్రచారం కల్పించారు.

## కేసముద్రం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ 86.14 శాతం.



**కేసముద్రం, ఫిబ్రవరి 11(నంది పత్రిక):** తెలంగాణ రాష్ట్రంలో రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలు కేసముద్రం మున్సిపాలిటీలో ప్రశాంతంగా ముగిసాయి. నూతనంగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీలో 15వేల 963 ఓటర్లు ఉండగా 16 వార్డులుగా అధికారులు విభజించారు. బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలకు 16 వార్డులకు మున్సిపాలిటీ పరిధిలోని 9 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఒకటో వార్డు ఉప్పరపల్లి రోడ్డు లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రెండు, మూడు వార్డులకు ధన్నసరిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నాల్గవ వార్డు సబ్ స్టేషన్ తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఐదో వార్డ్ అమీనాపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఆరవ వార్డు అమీనాపురంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం, ఏడవ వార్డు కేసముద్రం విలేజ్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎనిమిదవ వార్డ్ కేసముద్రం విలేజ్ లోని గ్రామ పంచాయతీ కార్యాలయం, 9వ వార్డు కేసముద్రం విలేజ్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పదవ వార్డు కేసముద్రం విలేజ్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనుబంధ భవనం, 11వ వార్డు, 12వ వార్డు, 13వ వార్డు, 14వ వార్డు, 15వ వార్డులకు కేసముద్రం స్టేషన్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, 16వ వార్డుకు కేసముద్రం విలేజ్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేయగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ముగిసే సమయానికి 86.14 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా ఎన్నికల సరళిని మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ లు పరిశీలించారు.

## 11 వ తేదీ..11మంది.. 11 నిముషాలు

### వైకాపా హాజరుపై స్పీకర్ ఛలోక్తులు

ఏపీ అసెంబ్లీ లాబీలో మీడియాతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సరదా వ్యాఖ్యలు చేశారు. వైకాపా సభ్యులు గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభకు హాజరై కాసేపు నిరసన తెలిపి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో స్పీకర్ స్పందిస్తూ 11వ తేదీన 11 మంది 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు!.. అంతకుమించి ఎక్కువ సమయం లేరుగా..! అని వ్యాఖ్యానించారు. సభ్యులు సభా సంప్రదాయాలను పాటిస్తే మంచిదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ ఆరంభమైన కాసేపటికే వైసీపీ సభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహా వైసీపీ ఎమ్మెల్యేలంతా 11 నిమిషాల వ్యవధిలోనే అసెంబ్లీ నుంచి బయటకు వెళ్లిపోయారు. తిరుమల లడ్డూ గోవిందా, గోవిందా అంటూ లాబీల్లో నినాదాలు చేశారు. ఈ సమయంలో జై జగన్ అనే నినాదాలని వైసీపీ సభ్యులు చేయగా.. నినాదాలు చేయొద్దని జగన్ వారించినట్లు తెలుస్తోంది. జగన్ చెప్పిన వినకుండా మరింత బిగ్గరగా సభ్యులు అరిచారు. సరిగ్గా 10 గంటలకు అసెంబ్లీలోకి వైసీపీ సభ్యులు వెళ్లి.. కేవలం 11 నిమిషాల పాటు నినాదాలు చేసి వైసీపీ సభ్యులు బయటకు వచ్చారు.

## మూసీ ప్రాజెక్టులో కీలక అడుగు

### భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూసీ అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఖీఆఅఒ) బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు పరిధిలో అధికారులు భూసేకరణ చర్యలు చేపట్టనున్నారు .హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు పక్రియ ప్రారంభమైంది. భూ యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏమైనా అభ్యంతరాలంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. నిబంధనల ప్రకారం..

# స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

**అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా ప్రగతి పయనం**

**19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగాం**

**2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు**

**విద్యుత్, సాగునీటి పారుదల రంగాల్లో తిరోగమనం**

**వ్యవస్థల నిర్వీర్యంతో కుంటుపడిన అభివృద్ధి రంగం**

**ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం**

రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలను చవిచూసిందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు రాష్ట్ర పురోగతికి విఘాతం కలిగించిందన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రజా సంక్షేమం అనే కోణంలోనే.. ప్రభుత్వం ప్రతీ నిర్ణయాన్ని తీసుకుంటోందని తెలిపారు. ఏడాదికి రూ.33వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా ఇతర డీబీటీ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. 63.12 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రయోజనం చేకూరుతోంద న్నారు. 66 లక్షలకు పైగా విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా ఆర్థిక సాయం అందుతోందని గవర్నర్ వెల్లడించారు. 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగు నీటి పారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవిచూశాయి. గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ప్రజలు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. గత 19 నెలలుగా మా ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి పథం వైపు పయనిస్తోంది. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రధానంగా దృష్టి పెట్టాం. విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యాలలో కీలక సవరణలు చేశాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి పది సూత్రాలు రూపొందించాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే దీని లక్ష్యం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశించిందని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోందని గవర్నర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున 46.86 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతోందన్నారు. దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్ల రిక్రూట్మెంట్ కూడా ప్రభుత్వం పూర్తి చేసిందని వివరించారు. మత్స్యకార సేవలో పథకం ద్వారా 1.2 లక్షల మందికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోందని తెలిపారు. లక్ష మందికి పైగా హ్యాండ్లూమ్, పవర్లూమ్లపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు 200, 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోందని గవర్నర్ చెప్పారు. విభజన సమస్యలతో పాటు వారసత్వంగా వచ్చిన ఆర్థిక నష్టాలతో ప్రభుత్వం పాలన ప్రారంభించిందని అబ్దుల్ నజీర్ చెప్పుకొచ్చారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గత పాలకులు ధ్వంసం చేశారన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో అభివృద్ధి ఆగిపోయిందని.. ఆర్థికపరమైన ఇబ్బందులు పెరిగాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా గత పాలకులు పాలించారని.. 22ఏ అధికరణను దుర్వినియోగం చేశారన్నారు. మౌలిక వసతులైన విద్యుత్, సాగునీరు, రహదారులు లాంటి రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని గవర్నర్ తెలిపారు. 2024లో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పజెప్పారని.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతోందని వెల్లడించారు. 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని పునర్నిర్మించి గాడిలో పెట్టిందన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రీస్టార్ట్ అయ్యాయని తెలిపారు. తొలి 9 నెలల కాలంలో దిద్దుబాటు చర్యలు, పాలసీలు, వ్యవస్థల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసి పారదర్శకమైన పాలనను కూటమి ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పాలన సాగిస్తోందన్నారు. పది సూత్రాలను నిర్దేశిరచుకుని.. ప్రజలకు సుపరిపాలన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకంగా చేసుకుని ప్రభుత్వ పాలన సాగుతోందని అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని గవర్నర్ వెల్లడించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతీ కుటుంబానికి అవసరమైన ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. త్వరలో ఫ్యామిలీ కార్డును అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పీ4 ద్వారా పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవరూ ఆకలితో ఉండకూడదనే సూత్రంతో 113 నియోజకవర్గాల్లో 205 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. త్వరలో మిగిలిన నియోజకవర్గాల్లోనూ గ్రామీణ అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని గవర్నర్ నజీర్ వెల్లడించారు. అందరికీ ఇల్లు.. అనే లక్ష్యంతో గృహ నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు గవర్నర్. ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా చేసిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం.. వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా బీసీ వర్గాలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపట్టిందన్నారు. మైనారిటీలకు భద్రత, వారికి అభివృద్ధిలో భాగస్వామ్యం, విద్య, ఆర్థిక సహకారంతో మేలు చేకూరుస్తోందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు.రాష్ట్రం ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లాంటి రంగాల్లో దూసుకెళ్తోందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తోందన్నారు. అంతర్జాతీయ సంస్థలు.. ఏపీని పెట్టుబడులు, నాలెడ్జ్ ఎకానమీకి గమ్యస్థానంగా ఎంచుకున్నాయని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా యువతకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గవర్నర్ వివరించారు. ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గించేలా.. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోందన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి రూ.2.5 లక్షల వరకూ సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తోందన్నారు. 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదురహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోందని అన్నారు. క్యాన్సర్ సహా ఇతర ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ప్రభుత్వం ఈ బృహత్ పథకాన్ని చేపడుతోందని చెప్పారు గవర్నర్. వృద్ధుల సంఖ్య పెరగడం వివిధ దేశాలకు సవాల్గా మారిందని.. దీనిపై సరైన విధానాన్ని రూపొందించాలని సభను కోరుతున్నట్లు గవర్నర్ తెలిపారు. అక్రమ మద్యం తయారీ నుంచి విముక్తి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని.. గంజాయి నిర్మూలనలో పురోగతి సాధించిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారన్నారు. అభివృద్ధి వ్యూహంలో మహిళలే కేంద్ర బిందువులని.. ఆర్థిక భాగస్వాములు, స్వయం పేరుతో డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు బ్రాండింగ్ చేస్తోందన్నారు.

ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని.. వచ్చే ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలనే లక్ష్యాన్ని నిర్దేశిరచుకుందని తెలిపారు. అంగన్ వాడీలను బలోపేతం చేసి.. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ద్వారా మహిళలకు న్యాయ సహకారం కూడా అందిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

# మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

**14న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న మంత్రి కేశవ్**

**15,16. సెలవులు..17, 18వ తేదీల్లో బడ్జెట్పై చర్చ**

**24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు**

**బిఎసి సమావేశంలో సమావేశాల నిర్వహణపై నిర్ణయం**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 7 వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 14 ఆర్థిక మంత్రి బడ్జెట్ సమర్పిస్తారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతిరోజూ ఉదయం గం.9:00 నుంచి మధ్యాహ్నం గం.1:30 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈనెల 14న బడ్జెట్ సమావేశం నిర్వహించనుంది. 15, 16న సెలవులు కాబట్టి 17, 18వ తేదీల్లో బడ్జెట్పై చర్చ, 18న రాష్ట్ర పద్దుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఉంటుంది. 19వ తేదీ నుంచి 8 పనిదినాలు, డిమాండ్ల గ్రాంట్లపై అసెంబ్లీ బీఏసీ చర్చించనుంది ఈ నెల 28న శనివారం నాడు కూడా అసెంబ్లీ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. మార్చి 1, 2, 3వ తేదీల్లో అసెంబ్లీకి సెలవు దినాలుగా నిర్ణయించింది. మార్చి 6, 7న బడ్జెట్పై మరోసారి చర్చించనున్నారు. ఆ తర్వాత అవసరం మేరకు అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలా? వద్దా? అనే విషయమై అసెంబ్లీ బీఏసీ నిర్ణయించనుంది. అసెంబ్లీ సమావేశాల్లో రోజూ జీరో అవర్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. 17 రోజులపాటు అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. 15 ఆదివారం కాగా.. మహా శివరాత్రి తర్వాత రోజు 16న సెలవు ప్రకటించారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. మార్చి 1, 2, 3 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. మార్చి 6న అమరావతిలోనే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగించాలని.. రోజూ జీరో అవర్ నిర్వహించాలని బీఏసీ భేటీలో నిర్ణయించారు. డిమాండ్ ఫర్ గ్రాంట్స్పై 8 రోజుల పాటు చర్చ జరగనుంది. ఆరు ఆర్డినెన్స్లకు సభ ఆమోదం తెలపనుంది. సమావేశాల సందర్భంగా పలు కీలక చర్చలు, బిల్లుల ఆమోదం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ విధానాలు, ఆర్థిక ప్రణాళికలపై ప్రతిపక్షం నుంచి తీవ్ర చర్చలు జరిగే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బ్జడెట్ సమావేశాల మధ్యలో ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సభ్యుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడమే లక్ష్యంగా ఉన్నట్లు సమాచారం. ఈసారి అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా, పరిపాలనా పరంగా కీలకంగా మారనున్నాయి.

# టాయ్లెట్ పేపర్ కన్నా నీచంగా వాడేసారు

**అనవసర యుద్ధాల్లోకి మమ్మలను లాగారు**

**అఫ్ఘాన్ వ్యతిరేక యుద్ధంలో పాల్గొనడంతో తీరని నష్టం**

**అమెరికా తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించి పాక్ రక్షణ మంత్రి**

ఒక దేశానికి ఇంత కంటే అవమానం ఏముంటుందీ.. ప్రతి దానికీ అడుక్కోవటం మొదలైతే ఇంత కన్నా విలువ ఎవరిస్తారు.. పక్క దేశంపై ఏడుపులు, పెడబొబ్బులు.. దాడులు.. కుట్రలు, విధ్వంసంతో నిత్యం హింసతో బతికే దేశానికి ఇంత కంటే గౌరవం ఎవరిస్తారు.. ఇవన్నీ

మన పక్కనే ఉన్న పాకిస్తాన్ దేశం గురించే.. పాకిస్తాన్ దేశాన్ని టాయిలెట్ పేపర్ కంటే నీచంగా.. నీచాతి నీచంగా చూస్తున్నారని స్వయానా రక్షణమంత్రి వాపోయారు. స్వయంగా పాక్ పార్లమెంట్లో ఏడుస్తూ చెప్పిన మాటలు.. పాకిస్తాన్ దేశం గౌరవం అమెరికా దగ్గర ఎలా ఉంది అంటే.. టాయిలెట్ పేపర్.. టిష్యూ పేపర్ కంటే నీచంగా ఉందంటూ ఆయన మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఆసిఫ్ ఖవాజా ఆ దేశ పార్లమెంట్ సాక్షిగా షాకింగ్ కామెంట్స్ చేశారు. అమెరికా తన సొంత ప్రయోజనాల కోసం పాకిస్తాన్ను టాయిలెట్ పేపర్ కంటే దారుణంగా వాడుకుని వదిలేసిందని వాపోయారు. అమెరికాతో సత్సంబంధాలు పాకిస్తాన్ను బలహీనపరిచి అస్థిరంగా మార్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. 1999 తర్వాత అమెరికాతో కలిసి పనిచేయాలని పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయం దేశానికి తీవ్ర నష్టాన్ని కలిగించిందని అన్నారు. పాకిస్తాన్ ఎప్పుడూ తమకు సంబంధం లేని యుద్ధాల్లోకి లాగబడిం దని ఆయన బహిరంగంగా అంగీకరించారు. అమెరికా తన రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందని అన్నారు. తర్వాత తమను టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా తీసిపారేసిందన్నారు. అఫ్గానిస్థాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం తాము చేసిన పెద్ద తప్పిదమని అన్నారు. దీనివల్ల దేశం చాలా నష్టపోయిందని.. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తోందని వాపోయారు.1999లో అప్పటి పాక్ సైన్యాధిపతి జనరల్ పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని సైన్యం.. ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసి అధికారాన్ని చేజిక్కించు కుందని ఆసిఫ్ ఖవాజా అన్నారు. 2001 తర్వాత అమెరికా మద్దతుతో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాలిబన్లకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అయితే, తాలిబన్లు తిరిగి తమపై హింసకు పాల్పడ్డారన్నారు. తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అగ్రరాజ్యం తమకు ఎటువంటి సహాయం చేయలేదని ఆరోపించారు.ఆఫ్ఘాన్పై అమెరికా చేసిన యుద్ధానికి పాక్ మద్దతు ఇవ్వడం ద్వారా తాలిబన్లకు పాకిస్తాన్ వ్యతిరేకంగా మారిందని ఒప్పుకున్నారు. అమెరికా చివరికి ఈ ప్రాంతం నుండి వైదొలగడంతో పాకిస్తాన్ దీర్ఘకాలిక హింస, తీవ్రవాదం, ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందని అన్నారు. అమెరికాను సంతృప్తి పరచడానికే పాక్ మాజీ సైనిక పాలకులు జియా-ఉల్-హక్, పర్వేజ్ ముషారఫ్ ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలో చేరారని పేర్కొన్నారు. మనం ఎదుర్కొన్న నష్టాలను ఎప్పటికీ భర్తీ చేయలేమని.. పాకిస్తాన్ చేసిన తప్పులను తిరిగి మార్చలేనివి అని అన్నారు. ఇటీవల అమెరికాతో పాక్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతోంది. ఈ క్రమంలో అమెరికాకు వ్యతిరేకంగా పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ ఖవాజా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

## అసెంబ్లీలో జగన్‌ను కలిసిన దువ్వాడ

### తరవాత మాట్లాడుదామిన చెప్పిన వైకాపా నేత

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఏపీ అసెంబ్లీలో వైసీపీ బహిష్కృత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కలిసి మాట్లాడారు. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైఎస్ జగన్‌కు దువ్వాడ ఎదురుపడ్డారు. అసెంబ్లీ నుంచి బయటకు వచ్చే సమయంలో జగన్‌ను దువ్వాడ కలిశారు. దువ్వాడను చూసిన జగన్.. స్నేహపూర్వకంగా 'ఏం చేద్దాం శ్రీనివాస్?' అంటూ పలకరించారు. ధర్మానతో ఉన్న అంశాలపై మాట్లాడాలని దువ్వాడ అభ్యర్థించారు. సమగ్రంగా చర్చించేందుకు తాడేపల్లిలోని తన నివాసానికి రావాలని దువ్వాడను జగన్ ఆహ్వానించారు. వైసీపీ నుంచి సస్పెండ్ చేసినా సమావేశాల సమయంలో అసెంబ్లీకి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వస్తున్నారు. గతంలో ఆయనపై వచ్చిన వివాదాల నేపథ్యంలో ఏడు నెలల క్రితం వైసీపీ నుంచి పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. తాజాగా అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చే సమయంలో వైఎస్ జగన్‌ను దువ్వాడ కలిశారు. ప్రస్తుత పరిణామాలను జగన్‌కు వివరించే ప్రయత్నం చేయగా.. తర్వాత మాట్లాడదాం అంటూ మాజీ సీఎం వెళ్లిపోయారు. మండలిలో ప్రజా సమస్యలపై వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళ్లే ఆలోచనలో దువ్వాడ ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో వైఎస్ జగన్‌ను కలుస్తానని, వైసీపీలో అవకాశం ఇవ్వకుంటే సొంతగా పోటీ చేసి బలం చూపిస్తా అని దువ్వాడ శ్రీనివాస్ చెప్పారు. మీడియాతో దువ్వాడ మాట్లాడుతూ? 'మండలిలో ప్రజా సమస్యలపై ప్రస్తావిస్తా. వైఎస్ జగన్‌ను త్వరలోనే కలుస్తాను. తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుడి వైపు మాట్లాడతాను. మెడికల్ కాలేజీలని పీపీపీ విధానంలో నిర్మించాల్సిన అవసరం లేదు. జగన్ అవకాశం ఇవ్వకపోతే.. సొంతగా పోటీ చేసి నా బలం చూపిస్తాను' అని చెప్పారు.

## నలుగురు మంత్రులకు బెదిరింపు లేఖలు

### ఒకే తరహాలో ఉన్న లేఖల సారాంశం

### పోలీసులకు ఫిర్యాదు చేసిన కందుల దుర్గేశ్ పిఎస్

ఆంధ్రప్రదేశ్‌లో కొందరు కీలక మంత్రులకు అజ్ఞాత వ్యక్తుల నుంచి హెచ్చరికలతో కూడిన లేఖలు రావడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. జాగ్రత్తగా ఉండాలంటూ పంపిన ఈ లేఖలపై భద్రతా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఇప్పటికే మంత్రి కందుల దుర్గేష్ పీఎస్.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్‌లకు కూడా ఇదే తరహా హెచ్చరిక లేఖలు అందాయి. ఒకే విధమైన సందేశంతో పలువురు మంత్రులకు లేఖలు రావడం వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లేఖపై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ లేఖల వ్యవహారం అసెంబ్లీ లాబీల్లో విస్తృత చర్చకు దారి తీసింది. హెచ్చరిక లేఖల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ప్రభుత్వం మరింత జాగ్రత్తలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కందుల దుర్గేష్ మాట్లాడుతూ? 'మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖ చూసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. నాకు చాలా మంది ఫోన్లు చేశారు. నేను పనిచేసేది టూరిజం లాంటి చిన్న శాఖ. దీంట్లో మావోయిస్టులు లేక రాయాల్సినంత పెద్ద హడావిడి ఏముంటుంది. వ్యక్తిగతంగా, శాఖ పరంగా ఎక్కడ ఎలాంటి తప్పులు ఉండవు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారు. మావోయిస్టులు లేఖలు ఇలా ఉండవు కదా?' అని అన్నారు.

## గవర్నర్ ప్రసంగం అడ్డుకునే యత్నం

### సబలో నినాదాలు చేస్తూ వైసిపి వాకౌట్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు బుధవారం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం అయ్యాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ.. సభ నుంచి వాకౌట్ చేశారు. లడ్డు కల్తీ ఆరోపణలు, నిరుద్యోగ భృతి అంశం, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వంటి విషయాలపై ప్రభుత్వం వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. సభలో స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీ సభ్యుల నినాదాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. కొందరు సభ్యులు స్పీకర్ చైర్ వైపు పేపర్లు విసిరి నిరసన వ్యక్తం చేశారు. సభలో క్రమశిక్షణ పాటించాలంటూ స్పీకర్ సూచించినప్పటికీ.. వైసీపీ సభ్యులు ఆందోళన కొనసాగించారు. అనంతరం సభను బహిష్కరిస్తూ వాకౌట్ చేశారు. ఈ సంఘటనతో అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా మరింత వేడెక్కాయి. ప్రభుత్వ-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# స్పీకర్ సమర్థతగా ఉండాల్సిందే !

స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరా÷– జాకడ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలను ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసు కోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది సుస్పష్టం. ఇకపోతే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ రాహుల్ విపక్ష నేతగా సరిగా మాట్లాడకపోతే దానికి సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. కానీ అసలు మైక్ ఇచ్చీ ఇవ్వనట్లుగా స్పీకర్ వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. ఇది కూడా మంచిదే. ఎలాగూ బలం ఉంది. స్పీకర పదవికి వచ్చిన ధోకా లేదు. కనీసంఈ సందర్భంగా అయినా పార్లమెంట్‌లో చర్చ సాగితే మంచిదే. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు మంగళవారంనాడు నోటీసులు ఇచ్చారు. నోటీసును లోక్‌సభ సెక్రటరీకి అందజేశారు. ఇండియా కూటమికి చెందిన 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు. సభలో మాట్లాడేందుకు విపక్ష నేతలకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదంటూ ఈ నోటీసు ఇచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే పార్టీలు దీనికి మద్దతు పలుకగా, తృణమూల్ కాంగ్రెస్ ఇంతవరకూ సంతకం చేయలేదు. ఈ ప్రక్రియను సమీక్షించనున్నట్టు టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని, రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని పేర్కొన్నాయి. కాగా, అవిశ్వాస తీర్మానం పరంగా లోక్‌సభలో బలాబలాలను చూసినప్పుడు లోక్‌సభలో అధికార పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. 293 మందితో మెజారిటీ సభ్యుల బలం వారికి ఉండగా, విపక్షాలకు 214 మంది సభ్యుల బలం ఉంది. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా తెలుస్తుంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాలను చర్చకు అవకాశం ఉంటుంది. కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. మాజీ ఆర్మీచీఫ్ నరవాణె అముద్రిత పుస్తకంలోంచి కొన్ని పదాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడాలనుకున్న అవకాశం దక్కలేదు. ఒకవేళ అముద్రిత పుస్తకం ప్రస్తావన వద్దని చెప్పడం వేరు. కానీ అసలు మాట్లాడనీయక పోవడం సరికాదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. ఇకపోతే అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని ఓంబిర్లా నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడు తున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం,

మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. కాగా, దీనికిముందు అధికార పార్టీకి తలొగ్గి తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు. ఇవన్నీ ఎలా ఉన్నా పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్దంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది.

# ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ

### 500 మంది నుంచి 270 కోట్లు వసూళ్లు

### ఎనిమిదేళ్లయినా అతీగతీ లేని ప్రాజెక్టు

### ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

ఊదరగొట్టే ప్రకటనలు ఇస్తారు. అతి తక్కువ ధరకే ప్లాట్స్ ఇస్తామంటూ ఊరిస్తారు. తీరా చూస్తే.. డబ్బులు కట్టించుకుని ఏళ్లకు ఏళ్లు.. వారి చుట్టూ తిప్పించుకుంటారు. డబ్బులు చేతిలో పడ్డాక.. ఉసూరమనిపిస్తారు. అంతా రియల్ మాయాజాలం. ఆ రియల్ మాయకు అమాయకులైన జనం మోసపోతున్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి రియల్ మోసాలు చాలా జరుగుతున్నాయి. తాజాగా అలాంటి చీటింగ్ గ్యాంగ్ ఒకటి వెలుగులోకి వచ్చింది. కూకట్‌పల్లిలో వైట్ వాటర్ పేరుతో ప్లాట్స్ అమ్ముతున్నామని ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో మోసం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 500 మంది నుంచి 270 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. పదేళ్ల నుంచి ప్రాజెక్టు పేరు చెప్పి డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వైట్ వాటర్ కన్స్ట్రక్షన్ యజమాని అజయ్‌తో పాటు పలువురుపై కేసుల నమోదు చేసి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు మూసాపేట పవర్ నగర్ కాలనీకి చెందిన భోగాడి సుజాత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేశారు పోలీసులు. ఐతే ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదు. వైట్ వాటర్స్ యాజమాన్యానికి ఎ÷–లాట్ కొనుగోలు కోసం ఫిర్యాదుదారు సుజాత సుమారు 80 లక్షల రూపాయలు చెల్లించారు. కానీ ఆమె తీసుకున్న ఎ÷–లాట్‌ను బ్యాంకులో తనఖా పెట్టినట్లు ఆమెకు తెలిసింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మరోవైపు వైట్ వాటర్స్ యాజమాన్యం.. ఎ÷–లాట్ల కొనుగోలుదారులకు ఎ÷–లాట్లను స్వాధీనం చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికే డబ్బు చెల్లించి పదేళ్లు గడిచిపోయిందని బాధితులు చెబుతున్నారు. పైగా ధరలు పెంచడం, ఒకే ప్లాట్‌ను పలుమార్లు అమ్మారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో వైట్ వాటర్స్ యాజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిజానికి ఈ వైట్ వాటర్స్ ప్రాజెక్టు వెంచర్‌ను 2018లో ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు కేవలం టవర్స్‌లో నిర్మాణం కొంతమేర పూర్తయింది. అ, ఆ టవర్ల బేస్‌మెంట్లు మాత్రమే పూర్తి చేశారు. ఇ, ఈ టవర్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. నమోదు గడువు ఇప్పటికే రెండుసార్లు పొడిగించగా.. ఈ ఏడాది జూన్‌లో అది కూడా ముగియనుందని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. గతంలో డిసెంబర్ 2024, డిసెంబర్ 2025లో ఎ÷–లాట్లు హ్యాండ్ ఓవర్ చేస్తామని చెప్పి మోసం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. వైట్ వాటర్స్ యజమాని అజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుకున్నారు. ముందస్తుగా డబ్బులు చెల్లిస్తే అతి తక్కువ ధరకే ఎ÷–లాట్ ఇస్తామంటూ అందరిని నమ్మించాడు అజయ్. దీంతో ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో వచ్చిన దీనిని ఆకర్షితులై చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇప్పటివరకు 270 కోట్ల రూపాయలకు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇక్షచి పోలీసులకి ఇప్పటివరకు వందమంది కాంటాక్ట్ అయ్యారు. మరోవైపు పోలీస్ కేసు నుంచి తప్పించుకునేందుకు అజయ్ కొత్త నాటకానికి తెర తీసినట్టు బాధితులు చెబుతున్నారు. తమకు డబ్బులు ఇస్తామని చెప్పి నమ్మించి.. కొందరి చేత కేసులు విత్ డ్రా చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం ఆర్డీవో విశ్వనాథ్





### ఉత్సవాల సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏఎస్పీ మందా జావలి

**మహానంది ఫిబ్రవరి 11 (నంది పత్రిక):–** మహానందీశ్వర స్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సమిష్టి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేద్దాం అని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా మహానంది లోని పొచా బ్రహ్మానందరెడ్డి విశ్రాంతి భవనంలో ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవో విశ్వనాథ్ అధ్యక్షతన రెండవ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు.ఆర్డీవో విశ్వనాధ్ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు.ఆలయ ప్రాంగణాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పందులు, గుర్రాలు సంచరించకుండా వాటి యజమానులతో మాట్లాడి నోటీసులు జారీ చేయాలన్నారు.మహానందీశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి తోపులాటలు లేకుండా చూడాలన్నారు. లింగోద్భవ సమయంలో జరిగే అభిషేక పూజలకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం పలకాలన్నారు.నంద్యాల ఏఎస్పీ మందా జావళి మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సుమారు వంద మందికి పైగా పోలీసు సిబ్బంది బందోబస్తు వీధుల్లో ఉంటారన్నారు.కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు.దొంగతనాలు జరగకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని అన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు.క్యూలైన్ లలో తొక్కి సలాటలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల్లో ఉన్న మద్యం దుకాణాలను ఉత్సవాల రోజుల్లో మూసివేస్తామని ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి స్పష్టం చేశారు. సమావేశంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, సిఐ శ్రీనివాసులు రెడ్డి, ఎస్సై రామ్మోహన్ రెడ్డి, మహానంది దేవస్థానం ఏఈఓ మధు, ఆలయ సూపరింటెండెంట్లు శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, సుబ్బారెడ్డి, తహసిల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహబూబ్ దౌల,విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వందేమాతర గీతం ఇక తప్పనిసరి

### జగనణమన కంటే ముందే వందేమాతరం

### ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతేకాకుండా అన్ని పౌరపురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని తెలిపింది. అయితే సినిమా హాళ్లలో దీనిని ప్రదర్శించాల్సిన అవసరం లేదని నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా.. అంతరాయం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. కొత్త నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలుశిక్ష విధించనున్నారు.

ఇదిలా ఉంటే.. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో దీన్ని భాగం చేశారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు వచ్చాయి. అందులో ఆరు చరణాలను పాడాలని కేంద్రం పేర్కొంది. వాటిని 3 నిమిషాల 10 సెకన్లలో ఆలపించాలి. స్వాతంత్ర్య పోరాట సమయంలో ముస్లింలీగ్ అభ్యంతరాల మేరకు.. ఆరు భాగాల్లోంచి ఎలాంటి మతపరమైన ప్రస్తావనా లేని తొలి రెండింటిని మాత్రమే కాంగ్రెస్ స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం వివాదంలేని తొలి రెండు భాగాలతో.. వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com